శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై!
సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీకీ జై!!



అనంతమైన శ్రీసాయి
ప్రేమాంతరంగము నుండి
ఉద్భవించి..

తరతరాలను సాయిపదాలను
చేరుస్తున్న మహోత్తుంగ
జ్ఞానతరంగం..

సాయిభక్తిపథంలో
ఛాందసభావాల తమస్సును
తుదముట్టించిన
తేజోరాజం..

**శ్రీబాబూజీ..**

# సాయిపథం

విజయదశమి సంచిక



## బాబా పాదాలు పట్టుకోవడం అంటే?

**భక్తుడు :** గురువుగారూ! బాబా పాదాలు పట్టుకోవడమంటే ఏమిటి?

**గురువుగారు :** బాబాను మనసులో నిలుపుకోవడమని అర్థం. బాబాను స్మరించడమని అర్థం. అన్నిటికీ నువ్వేనూ, నాకు నువ్వు తప్ప ఇంకెవ్వరూ లేరని అర్థం. ఆయన ముందు మన అహంకారం ఏమీ లేకుండా పూర్తిగా పాదాక్రాంతమవడం అని అర్థం.

**పాదమంటే ఏంటి? మనముండేటువంటి స్థానం.** మనమెక్కడుంటే అక్కడ మన పాదముంటుంది. కాబట్టి **బాబాను మన మనసులో నిలుపుకోవడమే బాబా పాదాలు పట్టుకోవడమంటే!** ఇంకా కొద్దిగా ముందుగా ఆలోచిస్తే, ఆయన చెప్పినటువంటి మాట– ఆయన బాటలో నడవడం. అదే ఆయన పాదాలు పట్టుకోవడం. దొరికితే పట్టుకుంటావు. దొరక్కపోతే? ఆయన అడుగుజాడల వెంటబడిపోతాం. **అదే పాదాలు పట్టుకోవడం.**

**– శ్రీసాయినాథుని శరత్ బాబూజీ**

సంపుటి : 26
సంచిక : 4



విజయదశమి సంచిక
24 అక్టోబర్ 2023

గురుకృప





# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది. **- శ్రీబాబూజీ**

## లోపలి పేజీలలో

**పథగామి** 4
- గురుకృప

**నిజమైన ప్రశ్నలు** 6
- శ్రీబాబూజీ

**గురు శిష్యుల ప్రేమ** 7
- సాయిదీవెన

**సద్గురువు... సద్గ్రంథం** 11
- గురుకృప



12 **ప్రశ్న - సమాధానము**
- మోపిదేవి కృష్ణస్వామి

14 **శ్రీబాబూజీ సత్సంగభాషణలు**
- సాయిపథం

25 **గురుకృపాలహరి**
- గురుకృప

నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**

**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

## మంచికాలం - చెడు కాలం

భారతీయ మత జీవనం ఒకప్పటి ఆధ్యాత్మికత స్థాయి నుండి చాలా కిందికి దిగివచ్చినట్లు కనిపిస్తుంది. ఈనాడు ఎక్కువ మంది భారతీయుల మతాచారం యావత్తూ దేవాలయాలకు వెళ్ళి రావడం, మొక్కులు తీర్చుకోవడం, అయిన దానికీ, కానిదానికీ శుభ ఘడియలు, అశుభ ఘడియలు ఎంచడం అనే విషయాలకు పరిమితమైనట్లు తోస్తుంది. మనుష్యుల్ని స్వేచ్ఛగా వదిలేస్తే వారు ఏయే విపరీతాలకు పూనుకుంటారో అనే ఉద్దేశంతో ఈ నియమ నిబంధనలన్నీ పెట్టి వారి జీవితాలను ఒక క్రమంలో నడిపించడానికి ఏర్పరచిన విధి-విధానాలు నిషేధాలే కానీ, వీటి ద్వారానే ఆ మహాప్రేమను, ఆ మహాకరుణను కనుగొనడం ఎలాసాధ్యపడుతుంది? అందుకు అవసరమైన ప్రయత్నం వేరు. శుభాశుభాలు, లాభనష్టాలు పట్టుకు వేళ్ళాడుతూ ఉంటే, **'అసలు ప్రయత్న'మనేదే జరగకపోవచ్చు** (ఒక్క అడుగు వేయలేము).

చాలామంది కొన్ని మంచి రోజులనీ, మరికొన్ని చెడ్డ రోజులని విభజించుకుంటూ ఉంటారు. ఈ నిర్ణయాలను పంచాంగాలు, తెలుగు కాలెండర్ల ఆధారంగానే చేస్తూ ఉంటారు. పంచాంగానికీ, పంచాంగానికీ పొత్తు కుదరదు. ఏకాదశి ఫలాని ఘడియలలో ప్రవేశిస్తుందని ఒకరు రాస్తే, మరేవో ఘడియలలో ప్రవేశించనున్నదని వేరొక దాంట్లో రాసి ఉంటుంది. ఏది ప్రమాణ పూర్వకమైనదో ఎవరికీ సరిగా తెలియదు. ఎవరికి వారు తమ పూర్వీకులు యే పంచాంగాన్ని అనుసరించి ఉంటారో అదే "స్టాండర్డ్" పంచాంగమంటారు.

తెలుగువారికి అమావాస్య మంచిరోజు కాదు. తమిళులకు అమావాస్య మంచిరోజే. మరి భగవంతుడి సృష్టిలో అసలు ఆ రోజు మంచిదో చెడ్డదో ఎలా తెలియాలి? ఏ ప్రాంతం వారు ఆ ప్రాంతపు నమ్మకాలతో బ్రతకాలని సర్ది చెబుతుంటారు. కానీ తెలుగువాళ్లు ఒకటి రెండు తరాలపాటు తమిళ ప్రాంతంలో ఉండి, అదే విధంగా తమిళులు ఆంధ్రప్రాంతంలో ఉండి, స్థిరపడిపోయిన సందర్భంలో దీనిని ఎలా పరిష్కరించాలి?

మాట్లాడే భాష మీద మక్కువ ఉంటే అలా చేయండి. నివసించే ప్రాంతం మీదనే ఇష్టమైతే ఇలా చేసుకోండి అని మరో సమాధానం. అంటే తరతరాలుగా మనసులో ఏ భయమైతే గట్టిగా చోటు చేసుకున్నదో, దానిని అనుసరించి నడుచుకుంటే మనసుకు కొంత ధైర్యం, కొంత ఊరట



కలుగుతాయన్నమాట. కానీ మనకుండే ఈ కాస్త జీవిత కాలంలో ఇలా మంచి– చెడూ అని విభజించుకుంటూ కాలాతీతమైన దానికై జరగవలసిన మానవ ప్రయత్నం వాయిదా వేస్తూపోతే తరుణోపాయం ఎప్పటికి లభించేను? మానవజన్మ ఎప్పటికి సఫలమొందేను?

ఒకసారి ఓ భక్తుడు శృంగేరి ముప్పై నాల్గవ పీఠాధిపతియైన శ్రీచంద్రశేఖరభారతీ స్వామివారిని తనకు ఉపదేశం అనుగ్రహించమని కోరాడు. శ్రీవారు అతనిని ఫలానా రోజు రమ్మన్నారు. అతను అలాగే వచ్చి శ్రీవారి ముందు నిలుచున్నాడు. ఉపదేశం కోసం సమీపంగా కూర్చోమని శ్రీవారు ఆదేశించారు. ఆ భక్తుడు వెంటనే కూచోక "ఈ రోజు అష్టమి" అన్నాడు. శ్రీవారు "అలాగా, అయితే తర్వాత చూద్దాం" అని అన్నారు. ఈ భక్తుడు వెలికివచ్చి "స్వామివారు ఈ రోజు అష్టమి అనే విషయం మరచినట్లున్నది. నేను వారికి గుర్తు చేసాను. అందుచేత నాకు ఉపదేశం ఇంకోరోజు చేస్తామని అన్నారు" అని నాతో చెప్పారు. (ఈ వాక్యాలన్నీ 'విశాఖ' రాసిన పుస్తకంలోనివి. ఆంగ్లంలో శ్రీకృష్ణస్వామి అయ్యర్ రాసిన దానికి అనువాదం).

ఇంతలో శ్రీవారు మరొక భక్తుణ్ని ఉపదేశానికి పిలిచారు. దీనిని చూసి నా స్నేహితుడు "ఇపుడే కదా నేను శ్రీవారితో ఈ రోజు అష్టమి అని మనవి చేసాను. మరి ఉపదేశానికి అతనిని పిలుస్తున్నారే?" అని నన్ను అడిగాడు. అందుకు నేనిలా అన్నాను. "అవును ఈ రోజు అష్టమి నీ వరకే. అతనికి లేదు. నీకు అష్టమి శుభకాలం కాదని తోచింది. శ్రీవారు నీ అభిప్రాయాన్ని ప్రతిఘటించదలచలేదు. అలా నీ మాటలను మన్నించక ఆయన నీకు ఉపదేశించి ఉంటే నీకేదైనా జరిగితే నీవు ఎప్పుడూ ఇది అష్టమి నాటి ఉపదేశఫలం" అని అనుకునేవాడివి. అందుచేతనే నీకు శ్రీవారు మంత్రదీక్ష ఇవ్వలేదు. అతనికి అలా కాదు, గురువు ఏ రోజు నిర్ణయించాడో, ఆ రోజు తదేవలగ్నం, సుదినం, తదేవ తారాబలం, చంద్రబలం అన్నీ అపుడే అన్న భావధారుద్యము కలవాడు. పంచాంగాలతో నిమిత్తం లేదు. అందుకే దీక్ష పొందుతున్నాడు. ఇదీ మన పరిస్థితి. సద్గురువు తటస్థపడ్డప్పుడు కూడా పంచాంగాల కాల నిర్ణయాలు, మంచీ చెడులతోనే సరిపుచ్చుకుంటూ ఉంటాం. ఇలాంటి వాటితో ముడిపడిన జీవితం, మనసును దాటి పవిత్రమైన దానిని కనుగొనే ప్రయత్నమేమి చేస్తుంది?

**జీవితమంటేనే పరమ పవిత్రమైన ధ్యానమని నమ్మిన మనిషి. అనవసరమైన ప్రస్తావనలతో కాలక్షేపం చేస్తూ కూచోడు. ధ్యానాన్ని విస్మరించిన దినాన్ని మాత్రమే అశుభదినంగా పరిగణిస్తాడు. మనసును ధ్యానంవైపు మళ్ళించేవాడికి శుభాశుభాలతో పనేమిటి? జీవితయాత్రకై తనకి భూమిపై**



**ఇచ్చిన పరిమిత కాలం యావత్తూ శుభమైనదే. దానిని సద్వినియోగం చేసుకోక, వ్యర్థమైన కార్యకలాపాలతో జీవితాన్ని పాడుచేసుకోవడమే అన్నింటికన్నా పెద్ద అశుభం. గురువుని మరచిన క్షణమే అశుభకాలం.**

***– నీలంరాజు లక్ష్మీప్రసాద్***

# నిజమైన ప్రశ్నలు

**గురువుగారు :** మీ ప్రశ్న ఏమిటో ఇంకొక్కసారి తిరిగి అడగమని నేను మిమ్మల్ని అడిగినప్పుడు, మీరు "పర్లేదు గురువుగారూ, అదంత ముఖ్యం కాదు" అన్నారంటే, ఆ మాటతో మీ ప్రశ్న నిజమైన ప్రశ్న కాదని రుజువు చేస్తుంది. నిజమైన ప్రశ్న మీకు చాలా ముఖ్యమైనదిగా ఉండాలి. మీకది తెలియాలి. ఆ ప్రశ్న మీలో నింపి తీరాల్సిన ఒక కొరతను సృష్టించాలి.

**భక్తుడు :** నా ప్రశ్నను ముఖ్యమైనదిగా చేసుకోవడానికి నేను దాని మీద పనిచేయాలని నా స్నేహితుడొకరు చెప్పారు.

**గురువుగారు :** ఆ అవసరం లేదు, ఎందుకంటే మనం మాట్లాడే ఈ విషయాలన్నీ నిజంగా అంత ముఖ్యమైనవి కావు. మనం ఇక్కడ అందరం కలసి కూర్చుంటున్నాము. ఈ ప్రశ్నలు మనందరినీ కలిపి కూర్చోబెడుతున్నాయి. ఆ రకంగా చూస్తే నన్ను ఈ కుర్చీలో ఉంచడం, అనే ప్రయోజనం నెరవేరినట్లే. (గురువుగారు నవ్వుతూ..)

సత్సంగంలో ఎవరైనా ప్రశ్నలు వేస్తూ ఉంటే, ఏ ప్రశ్నలూ అడగని మరికొందరు తమలో ఏదో లోపం ఉందని అనుకుని, ప్రశ్నలు వేసేవారిని అనుకరించడానికి ప్రయత్నిస్తూ, కొన్ని అసంగతమైన ప్రశ్నలు వేస్తారు. అది అవసరం లేదు. వారికి ప్రశ్నలు ఏవీ లేకపోతే, ఏమీ అడగవలసిన అవసరం లేదు. అలా చేయడం జబ్బుతో మందులు తీసుకుంటున్న వారిని మనం అనుకరించినట్లు ఉంటుంది. కొంతమందికి మేధోపరంగా కొంత ఇబ్బంది ఉంటుంది. ఆ ఇబ్బందికి ప్రశ్నలు, సమాధానాలు అనే మందు తీసుకుంటున్నారు. మీకు ఆ జబ్బు లేకపోతే, మందు తీసుకోవాల్సిన అవసరం లేదు. "ఆ వ్యక్తి రోజూ నాలుగుసార్లు మంచి మందులు తీసుకుంటున్నాడు, నేను కూడా నాలుగుసార్లు మందులు తీసుకోవాలనుకుంటున్నాను!'' అనుకోవడంలా ఉంటుంది.

***– శ్రీబాబూజీ సత్సంగభాషణాల నుండి***

# గురు శిష్యుల ప్రేమ - ఆ ప్రేమకు వెల ఎంత?



అది శ్రీరామకృష్ణులకు గొంతుకాన్సర్ సోకిన సమయం – 1885వ సంవత్సరం చికిత్స కోసం భక్తులు ఆయనను దక్షిణేశ్వరం నుండి కలకత్తాలోని శ్యాంపుకూరు తీసుకువెళ్ళారు. దాంతో గురుదేవులను వీడలేని శశిధరుడు రోజూ తన ఇంటి వద్ద భోజనం చేసి వచ్చి రాత్రిపూట గురుదేవుల సేవలో నిమగ్నం అయ్యేవాడు. ఆ రోజులలో అతడు బి.ఏ. పరీక్షకు తయారవుతున్నాడు.

గురువు కేన్సర్ బారిన పడటంతో శశి అయోమయంలో పడ్డాడు. తాను పూర్తిగా గురుసేవకు అంకితం కావాలా? లేక చదువు కొనసాగించి తల్లిదండ్రుల ఆశ మేరకు జీవితాన్ని ఏర్పరచుకోవాలా? అతడు ఎవ్వరిమాటనూ ఖాతరు చేయకుండా తాను అమితంగా ప్రేమించే గురుని సేవే తన జీవితానికి పరమావధిగా ఎన్నుకొని ఇక ఇంటికి వెళ్ళడం మానేశాడు. చదువు వదలివేశాడు. ఎంత ధైర్యం అతడికి.

అప్పుడు పక్కనే వున్న ఒక వృద్ధుడు శశితో, పరీక్షలు వ్రాసిన తరువాత గురువుని సేవించుకోవచ్చు కదా! అని అంటే, అందుకు శశి ఇలా అంటాడు. "పరీక్షలు వ్రాయడానికి ముందే నేను మరణించను అని మీరేమైనా హామీ ఇవ్వగలరా?" అని ఎదురుప్రశ్న వేస్తాడు. ఇంట్లో తల్లిదండ్రుల మాటను లెక్కపెట్టకుండానే గురుదేవుల సేవకు శ్యాంపుకూరుకు వచ్చేస్తాడు శశి.

**"గురుదేవుల సేవయే అత్యున్నతమైన పారమార్థిక సాధన"** అని అతడి దృఢవిశ్వాసం. గురుసేవ మినహా మరే ఇతర ఆధ్యాత్మిక సాధనలను అతడు సాగించలేదు. శశిధరుడు ఏ తీర్థయాత్రా చేయలేదు. ఏ తపస్సూ చేయలేదు. తన శరీరానికి అవసరమైన తిండి, నిద్ర, విశ్రాంతి, సుఖము ఇవేవీ అతడికి గుర్తు లేవు. తన సేవతో గురుదేవుల బాధను ఉపశమింపజేయడమే అతడి జీవిత పరమార్ధం. తన ప్రాణాన్ని పణంగా పెట్టడం వల్ల గురుదేవుల వ్యాధి నయమయ్యేటట్లయితే అందుకు అతడు సిద్ధంగా ఉండేవాడు. శ్రీరామకృష్ణులను శ్యాంపుకూరు నుండి కాశీపూర్ ఉద్యాన గృహానికి తీసుకువెళ్ళారు. అప్పుడు అది చలికాలం. ఒకరోజు రాత్రి శ్రీరామకృష్ణులు మలవిసర్జన చేసిన పాత్రను శుభ్రం చేసేందుకు శశిధరుడు గది బయటకు వెళ్లాడు. అప్పుడు అతడి శరీరం పైన కేవలం పల్చని బట్ట మాత్రమే ఉన్నది. పాత్రను శుభ్రం చేసి శశిధరుడు గది లోపలకు వస్తూనే లోపలి దృశ్యాన్ని చూచి బాధపడ్డాడు... కోప్పడ్డాడు కూడా.



గొంతు కేన్సర్ వ్యాధితో తీవ్రంగా బాధపడుతూ శుష్కించిన శరీరంతో అత్యంత దుర్బలంగా ఉన్న శ్రీరామకృష్ణులు మంచం మీద నుండి క్రిందకు దిగి నేల మీద మెల్లగా ప్రాకుతూ పోయి దండెం మీద ఆరవేసిన శాలువాను అందుకునే ప్రయత్నం చేస్తున్నారు. శశిధరుడిలో బాధ, ఏడుపు కట్టలు త్రెంచుకుంది. "అయ్యో! ఎంత పని జరిగిపోయింది. నేను పని తొందరలోపడి గురుదేవులకు శాలువా కప్పడం మరచిపోయాను. పాపం గురుదేవులు చలికి తట్టుకోలేక శాలువా కోసం ఎంత కష్టపడ్డారో గదా! అదంతా నా వల్లనే!" అని బాధతో ఏడ్వసాగాడు. తన మీద తనకే కోపం కూడా వచ్చింది.

అదే కోపంతో "అయ్యా! మీరేం చేస్తున్నారు? గాలి చల్లగా ఉండి వణికించేస్తోంది. ఈ పరిస్థితిలో మీరు లేచి తిరగకూడదు. శాలువా కావాలని అనుకుంటే నన్ను పిలిస్తే వచ్చి ఇచ్చేవాడిని గదా... నన్ను ఎందుకు పిలవలేదు?" అంటూ గురుదేవులను ప్రశ్నించాడు.

శ్రీరామకృష్ణులు తమ చేతితో శాలువాను పట్టుకొని, గొంతు నొప్పిగా ఉన్నప్పటికీ వచ్చీరాని లో గొంతుకతో "ఇంత చలిగా ఉన్నరోజున నువ్వు వంటిమీద సరియైన ఆచ్ఛాదన ఏమీ లేకుండా బయటకు వెళ్ళడం చూశాను. చలి బాగా ఎక్కువగా ఉందనిపించింది. నీ కోసమని దండెం మీద నుంచి ఈ శాలువాని తీశాను. దయచేసి దీన్ని నువ్వు కప్పుకో" అని శాలువాను శశి చేతికిచ్చారు.

ఆ మాటలతో శశిధరుడి హృదయం బరువెక్కింది. అంతటి దుర్భరస్థితిలో గురుదేవులు వారి గురించి ఆలోచించుకోకుండా, తన (శశిధరుని) కోసం శాలువా తీసి ఇవ్వడం అతడి గుండెనే కాదు, ఆ ఘటన కళ్ళముందు కదలాడుతుండగా మన గుండెలు కూడా పిండేసినట్లున్నది. మనందరికీ కంటనీరు తెప్పించే ఈ సంఘటన గురువుకు, శిష్యునకు ఒకరిపై ఒకరికి ఉన్న **గొప్ప ప్రేమకు నిదర్శనం. చదివినవారు, వినేవారు, చెప్పేవారు కంట నీరు పెట్టకుండా ఉండలేని ప్రేమ గురు-శిష్యుల ప్రేమ.**

సమర్థ రామదాసు ఛత్రపతి శివాజీకి గురువు. ఆయన రోజూ భిక్ష చేసుకునేవాడు. ఒకరోజున భిక్షకి వెళ్ళాడు. సరిగ్గా సమర్థ రామదాసు భిక్షకి వెళ్ళేసరికి ఆ అమ్మగారు ఆవు పేడతో ఇల్లు అలుకుతున్నారు. "అమ్మా కొంచెం భిక్ష పెట్టు" అన్నారు సమర్థ రామదాసు. ఆ ఘడియలో ఆవిడ ఏమి చిరాకులో ఉందో, అన్నం పెట్టలేదు సరికదా, ఆవు పేడతో అలుకుతున్న చేతిలో ఉన్న పిడచ గుడ్డ ఆయన ముఖాన వేసి కొట్టింది. ఇక ఆ రోజున రామదాసు ఎవరి ఇంటికి భిక్షకి వెళ్ళలేదు. మహాప్రసాదంగా ఆ గుడ్డని తీసుకొని కుటీరానికి వెళ్ళిపోయాడు. ఆ గుడ్డని శుభ్రంగా ఎక్కడా పేడ



లేకుండా కడిగేసి, ఎండలో ఆరబెట్టి, అందులో ఒక్కొక్క దారం తీసారు. వాటితో దీపారాధనకి వాడే వత్తులు చేసారు. శ్రీరామచంద్రమూర్తి ఫొటో దగ్గర ప్రమిదలో నూనె పోసి ఆ దారాలతో చేసిన వత్తులు వేసి దీపారాధన చేసి ఇలా ప్రార్థించారు. "రామచంద్ర ప్రభూ! శ్రీరామచంద్ర మూర్తి, నువ్వు ఎంతోమంది పాపులను నిష్పాపులుగా చేసావు. శ్రీరామా, శ్రీరామా అంటే చాలు వాళ్ళ పాపాలు కడిగేసావు. వాళ్ళ పాపాలు పోయాయి. రామచంద్రుడుని స్మరిస్తే ఈ భారతదేశంలోనే కాదు. ఈ సృష్టిలో ఎంతోమంది పాపులు నిష్పాపులుగా అయ్యారు. రామా! నన్ను పిడచగుడ్డ పెట్టి అమ్మ కొట్టింది. ఆ దారాలతో వత్తులు తయారుచేసి నీకు దీపారాధన చేస్తున్నాను. ఈ పిడచగుడ్డ నాది కాదు. ఈ దారాలు నావి కావు. ఇవి ఆ అమ్మవి. అమ్మ ఎంత బాధలో ఉండి, మనస్సు ఎంత ఇరుకులో పడిపోయి, ఇంటిలో ఎన్ని బాధలు పడి ఈ పిడచగుడ్డ పెట్టి నన్ను కొట్టిందో. నన్ను పిడచగుడ్డ పెట్టి కొట్టిందని నేను బాధ పడటం లేదు. అమ్మ మనస్సు ఎన్ని కష్టాలలో ఉందో, కుటుంబంలో ఎన్ని బాధలు, బరువులు మోస్తోందో, లోపల మనస్సులో ఎంత కష్టం లేకపోతే ఆ అమ్మ నన్ను పిడచగుడ్డ పెట్టి కొడుతుంది. శ్రీరామచంద్రమూర్తీ! ఆ అమ్మ కష్టాలని తీసెయ్యి, అమ్మ మనస్సులో ఉన్న దోషాలని తీసెయ్యి అమ్మకి క్షమ, సహనం కలుగచెయ్యి, అమ్మ మనస్సుకి మామూలు పరిస్థితి తీసుకురా. అమ్మ ఏ కష్టంలో ఉందో ఆ కష్టాన్ని తీసెయ్యి రామచంద్రమూర్తి, నువ్వు ఎంతోమంది భక్తులని రక్షించావు. ఈ అమ్మని రక్షించలేవా, ఎంత క్షోభ పడకపోతే, ఎంత దుఃఖంలో లేకపోతే పిడచగుడ్డ నాముఖం మీద వేస్తుంది" ఇలా ఆవిడ బాధను చూస్తున్నాడు రామదాసు. ఆ బాధని తొలగించమని శ్రీరామచంద్రమూర్తిని ప్రార్థిస్తున్నాడు.

అది గురువు యొక్క లక్షణం. ఇటువంటి ఒక్క గుణం మనలో ఎవరికైనా ఉందా? **ఆయనను కొట్టినప్పుడు ఆ అమ్మ మనస్సులో ఉన్న వేదనని చూస్తున్నాడు సమర్థ రామదాసు. అయ్యో నన్ను కొట్టింది అని కాదు. ఎంత బాధలో ఉందో అమ్మ, ఎంత భారం మోస్తోందో. ఆ కుటుంబం బరువు మోయలేకపోతోంది. ఎంత చిరాకులో ఉందో, లేకపోతే నన్ను ఎందుకు గుడ్డతో కొడుతుంది. ఆ కష్టాన్ని తీయవా రామచంద్రప్రభూ, నా మాటగా అయినా తీయవా** అని రామచంద్రమూర్తిని ప్రార్థించాడు. ఎల్లలు లేని సద్గురుప్రేమ ఒక రూపానికి పరిమితం కాక తరతరాలను అదే అవ్యాజప్రేమతో కాచుకుంటోంది. గురువుగారి చెంతన జరిగిన ఈ సంఘటన, మరో పార్శ్వాన్ని చూపుతుంది.



1991లో ఒకసారి నాకు రక్త విరోచనాలు మొదలై విపరీతంగా రక్తంపోతూ ఉండేది. నేను ఎన్నో మందులు వేసుకున్నా తాత్కాలికంగా తగ్గేది కానీ రెండోరోజుకల్లా మళ్ళీ తిరగబెట్టేది. శిరిడీలో ఉన్న గురువుగారికి ఫోనులో చెప్పుకుంటే "స్పెషలిస్టుకు చూపించమని" చెప్పారు. అప్పటికి దాదాపు ఒకటిన్నర నెల నుండి రక్త విరేచనాలు అవుతూనే ఉన్నాయి. ఆశ్చర్యం ఏమిటంటే ఒకటిన్నర నెలలపాటు అంత రక్తం పోతున్నా నాకు ఏ విధమైన బాధ, నీరసం లేదంటే అది గురువుగారి అనుగ్రహమే. కాబట్టి వారే తగ్గిస్తారు అన్న నమ్మకంతో ఏ స్పెషలిస్టుకూ చూపించలేదు.

ఉన్నట్టుండి ఒకరోజు రక్తవిరేచనాలు పూర్తిగా తగ్గిపోయాయి. గురువుగారికి వెంటనే తెలియపరుద్దామనుకుంటే వారు శిరిడీలో లేరు. తిరువణ్ణామలైకి వెళ్ళారని తెలిసింది. ఏ రకమైన వైద్యం, మందులు లేకుండానే తగ్గించిన గురువుగారికి స్వయంగా వెళ్ళి కృతజ్ఞలు చెప్పుకుందామని తిరువణ్ణామలై వెళ్ళాను. అప్పటికి నాకు తగ్గి వారం రోజులైంది. గురువుగారు తిరువణ్ణామలైలో రమణాశ్రమంలో దేవరాజ మొదలియార్ కాటేజీలో ఉన్నారని తెలిసి అక్కడికెళ్ళాను. గది తలుపు వెంటనే తీయలేదు. ధ్యానంలో ఉన్నారేమోనని అరగంట అక్కడే ఆగి మళ్ళీ పిలిచాను. పలుకలేదు. రెండు మూడు పిలుపులకు తలుపులు తెరుచుకున్నాయి. గడియ తీసిన గురువుగారు నిలబడే శక్తి కూడా లేక నిస్సత్తువగా వెళ్ళి, మళ్ళీ పడుకుండిపోయారు. అంతసేపు వారు నా పిలుపులు విని కూడా లేచే ఓపిక లేక అలాగే పడుకొని ఉన్నారేమో! గురువుగారు గడ్డం పెరిగి చాలా నీరసంగా ఉన్నారు. గదిలో ఎప్పుడో తెచ్చిపెట్టిన ఇడ్లీలు కాబోలు అలాగే ఉన్నాయి. నాకొక్క క్షణం ఏమీ అర్థం కాలేదు. ఎంతో ఆందోళనగా "ఏమైంది స్వామీ" అని అడిగాను.

దాదాపు వారం నుండి రక్తవిరేచనాలండీ, ఇక్కడకు వచ్చినప్పటి నుండీ మొదలయ్యాయి. వారానికే నాకిలా ఉందంటే పాపం యాభై రోజులుగా మీరు ఎంత బాధపడ్డారో కదా అనిపించింది" అన్నారు. గురువుగారి మాటలు బలహీనంగా, ఎక్కడో లో స్వరంతో నుంచి వస్తున్నాయి. ఒక్కసారిగా నాకు ఏడుపొచ్చేసింది. వారం నుండా? అంటే నాకు తగ్గినప్పటి నుండి అన్న మాట. నేను అనుభవించాల్సిన బాధనంతా గురువుగారు అనుభవిస్తున్నారు. కొద్దిసేపు నాకు మాటలు కూడా రాలేదు. అలాగే చూస్తుండిపోయాను. మెల్లగా ఎలాగో మాటలు కూడదీసుకుంటూ, "ఇప్పుడేం చేస్తే ఇవి తగ్గుతాయి?" అని మాత్రం అనగలిగాను. గురువుగారు అంత నీరసంలోనూ వెంటనే "ఎలా వచ్చాయో, అలానే పోతాయి" అన్నారు. ***(సాయిదీవెన)***

***సంకలనం : గురుకృప***

# సద్గురువు... సద్గ్రంథం



**గురువు ఆదర్శం మనం ఎలా ఉండాలో చెబుతుంది.**

**ఆధ్యాత్మికత మనం ఎలా ఉన్నామో చూపుతుంది.**

గురువుని పొందడమే కాకుండా, ఆయనను అనుభవించడమే అసలైన ఆధ్యాత్మిక ధ్యేయం. ఆ దృక్పథం మన మస్తిష్కంలో ప్రతిష్ట జరగాలి. అందుకు సద్గ్రంథ పారాయణ ఒక ఉపకరణం. నిరాకార సృష్టికర్త సాకారరూపమే ఈ సకల సృష్టి. విశ్వకారకుడు విశ్వంగా పరివర్తనం చెందాడు. అందువల్లే లోకంలో ఏ ఒక్కటీ సాధారణమైనది కాదు. అణువు నుండి అంతరిక్షం దాకా అన్నీ అసాధారణమైనవే. చూడగల్గిన కన్నుంటే అన్నీ అద్భుతాలే, పైకి సామాన్యంగా కనిపించేవన్నీ అంతర్లీనంగా మహాద్భుతాలు.

అడగడం నేర్పడం సాయిపథం.. మనం బాబాని ఏదయినా అడిగితే, నీకేం కావాలో నాకు తెలియదా అన్నట్లు చూస్తారు బాబా! ఆ తల్లి చూపును గమనించుకునే స్థితిలో ఉండదు పిల్లవాడు. బాబాని అడిగాం, బాబా సమాధానం కోసం మనం బాబా వంక చూస్తే ఆయన చూపుల్లో సమాధానం ఉంటుంది. మనకు తెలిసిన అంశాలను ఉదాహరణలుగా చూపిస్తూ, మనకు తెలియవలసిన సూక్ష్మాలను మన హృదయాలకు హత్తుకునేలా వివరించి చెప్పడమనేది అనాదిగా మహాత్ములందరిలో మనకు సహజంగానే గోచరించే ఒక కళ. మళ్ళీ ఈ కళను వినియోగించడంలో ఎవరి ప్రత్యేకత వారిదే. వారి లీలలలో, మాటలలో, ప్రవచనాలలో, గోష్టిలో ప్రబోధము, ఉపదేశం జమిలిగా ఉంటాయి. ఇదే గురువుగారు చెప్పినది, **"బాబా ప్రతి లీలా ప్రబోధాత్మకమే, వారి చెంతకు చేరువ చేసుకునే ప్రణాళికలో భాగమే"** అని. ఆ బోధలో రెండు పార్శ్వాలు.. ఒకటి వ్యక్తిగతంగా, రెండు సమాజపరంగా. ఉపదేశంలోనూ రెండు పార్శ్వాలు. ఒకటి సంస్కరణపరంగా, రెండు సాధనాముఖంగా. ఇలా ప్రయోజనకరంగా సాగే ఆ ప్రవచనాలు, అలతి, అలతి పదాలు వ్యక్తి తానుగా మేల్కొని, తనలో మేల్కొంటున్న సమాజంతో శ్రుతిని కలిపి, తనను తాను సంస్కరించుకుంటూ, సమాజపరంగా రావలసిన సంస్కరణకు దోహదం చేస్తూ, మానవ జీవిత నిర్వహణకు అత్యంత ఆవశ్యకమైన యోగసాధనలో చకాచకా ముందుకు సాగిపోయేటట్లుగా చేసేవి, యోగసాధనకు పరమావధియైన యోగజీవితాన్ని అతనికి సిద్ధింప చేసేవి. ఆ మహనీయుని ప్రవచనాలు అంతటివి. ఆయన ఒక జ్ఞాన భాస్కరుడై నిలచి జ్ఞానాన్ని కిరణాలుగా ప్రసరింపజేస్తూ, అజ్ఞానాంధకారాన్ని కరిగిస్తున్నారన్న అనుభూతి పొందాలి అప్పుడే అనుగ్రహవంతులం కాగలం.

**– గురుకృప**



# ప్రశ్న - సమాధానము

నాలాగ దారి దొరక్క జీవిత ప్రయాణంలో తికమక పడిపోతున్న వారెందరో ఉన్నారు. మరి వారందరూ మీ దగ్గరకు ఎప్పటికి చేరుకుంటారు? ఎలా చేరుకుంటారు? అన్నది ప్రశ్న.

నీలాగానే చేరుకుంటారు, వారికి కాలం కలిసి వచ్చినపుడు అన్నది సమాధానం. ఆశలతో, ఆవేశాలతో, ఈర్ష్యాసూయలతో, రాగద్వేషాలతో కనబడుతున్న, కలబడుతున్న మనుషులందరూ క్షోభిల్లిపోతున్నారు కదా! మరి వీరికి శాంతి ఎప్పటికి లభిస్తుంది? ఎలా లభిస్తుంది? అన్నది ప్రశ్న.

నీలాగే వారూ శాంతిని పొందుతారు. ఆ పొందడానికి వారి సమయం వారికి రానున్నది అన్నది సమాధానం.

అయితే వారి కోసం నేను చేయగలిగింది ఏమీ లేదా? అన్నది ప్రశ్న.

హద్దులు మీరిన ఆవేశంలో ఉన్నపుడు నీవు చేయగలిగింది ఆవేశపడటం మాత్రమే అన్నది సమాధానం.

మరయితే నేను చేయవలసింది ఏమిటి? అన్నది ప్రశ్న.

మొదటగా నీవు చేయవలసింది ఆవేశాన్ని వశంలోనికి తెచ్చుకోవడం. అటుపైన ఎవరిని గురించి నీవు బాధపడుతున్నావో, వారిని చిన్న చూపు చూడకుండా ఉండగలగడం.

"ఆ! నేను చిన్న చూపు చూస్తున్నానా?" అన్నది ప్రశ్న.

"అవును నీవేదో బాగుపడినట్లు, వారేమో ఇంకా బాగుపడనట్లూ నీకనిపిస్తుంది కదా! పామరులుగా, అజ్ఞానులుగా, పతనమైపోయినవారుగా వారు నీకు కనిపిస్తున్నారు కదా! మరి అదంతా వారిని చిన్న చూపు చూడటం కాదా? దీనిని విశ్వప్రేమ అని అనుకోమంటావా?" అన్నది సమాధానం.

"మరయితే నన్నేం చేయమంటారు?" అన్నది ప్రశ్న.

మొదట, వారిని చిన్న చూపు చూడటం మానేయ్. ఒకప్పుడు నీవూ అలా ఉండి ఉన్న వాడివేనన్న అంశం గుర్తు తెచ్చుకో. చిన్న చూపు చూస్తూ ఆవేశపడిన నాడు నీవు **అహంకారివి** కాగలవేమోగాని, వారికి **సహకారివి** మాత్రం కాలేవు. వారిలో ఉన్నదీ **దైవమే కనుక వారిని ఆరాధించడం నేర్చుకో.** శిలను ఆరాధించినపుడే శిల్పి శిల్పాన్ని రూపొందించగలడు. తోటివారిలో దైవాన్ని దర్శించగలిగినపుడే

వారు దైవమూర్తులుగా నిలబడేటందుకు కావలసిన దోహదాన్ని నీవు అందించగలవు. అపుడే నీకా అవకాశం ఈయబడుతుంది అన్నది సమాధానం.



**- మోపిదేవి కృష్ణస్వామి**

మహాత్ములున్నదెందుకు? అదెలాగ? అంటే, దానికి సమాధానం బాబానే వివరించి ఉన్నారు. "భక్తులకు ఐహికంగాను, ఆముష్మికంగాను లాభం చేకూర్చడానికే మహాత్ములున్నది" అనేవారు బాబా.

అంతేకాదు. డబ్బు, వ్యాపారము, ఆరోగ్యము, సంతానము, ఉద్యోగం తదితర విషయసంబంధమైన సమస్యలతో కోరికలతో బాబాను ఆశ్రయించే భక్తులను నిరసిస్తూ, "శ్రీసాయిబాబా వంటి సద్గురువును ఆధ్యాత్మికోన్నతి కోసం ప్రార్థించాలిగాని, తుచ్ఛమైన ప్రాపంచిక కోరికలతో ఆశ్రయించకూడదు" అని హితవు చెబుతున్న ఒక భక్తునితో బాబా, "అలా అనొద్దు! నాకు సంబంధించినవారు మొదట అలాంటి కారణాలతోనే నా దగ్గరకు వస్తారు. వారి కోరికలు తీరి జీవితంలో సౌఖ్యం చిక్కాక, నన్ను అనురించి ఆధ్యాత్మికంగా, పురోగమిస్తారు. నిజానికి, రకరకాల మిషల మీద నేనే వారిని నా దగ్గరకు రప్పించుకుంటాను. వారెంత దూరాన ఉన్నా సరే నేనే వారిని కోరి నా వద్దకు చేర్చుకుంటాను. ఎవరూ వారంతట వారుగా నా దగ్గరకు రారు!" అని అన్నారు. ***(శ్రీసాయిభక్తి సాధనా రహస్యం)***

## అడుగు పెడితే అడుగు తగలాలి

"నీవు ఒక అడుగు నావైపు వేయి, నేను పది అడుగులు నీవైపు వేస్తాను" అంటారు బాబా. అలానే "నీవు ఒకటిస్తే నేను పదింతలు ఇచ్చి ఋణం తీర్చుకోవాలి" అంటారు బాబా. ఒక పని మొదలుపెడితే చివరికంటా చేయాలి అంటారు శ్రీబాబూజీ. అడుగు వేయడం అంటే అడుగు (బాటమ్) తగలాలి అపుడు కదా జ్ఞానరత్నాలు లభించేది. చేసేది ఏదో పూర్తిగా చేయండి. దిగేది ఏదో పూర్తిగా దిగండి. అడుగు పెడితే అడుగు తగలాలి. అడుగు తగలకుండా మధ్యలో ఆగితే ఏదో తెలియని అశాంతి ఏర్పడుతుంది. ఏమిటా ఇలా ఉంది అనిపిస్తుంది. ఇప్పుడేం చేయాలి అనిపిస్తుంది. ఏమీ చేయనక్కరలేదు. ఆ అడుగు క్రిందకు దింపండి. అడుగు తలుగుతుంది. మీ అశాంతి తొలగిపోతుంది. జీవితంలో పట్టు కుదురుతుంది. సగటు, సగటుగా వద్దు. అది మరీ దుర్భరస్థితి. అటో, ఇటో తేల్చుకొని మరీ దిగండి. పూర్తిగా అటున్నా, పూర్తిగా ఇటున్నా ఫరవాలేదు. మధ్యలో నిలబడి అటూ ఇటూ చూస్తున్నపుడే ఇబ్బంది. రెంటికీ చెడ్డ రేవడి అంటే ఇది. మీకీ పద్ధతి నచ్చింది.



నూటికి నూరుపాళ్ళు దీనికి తగినట్లు వర్తించండి. నచ్చలేదూ! నచ్చనట్లే ఉండిపోండి. అపుడు పెద్ద ఇబ్బంది ఏం ఉండదు. మధ్యలో మాత్రం నిలబడవద్దు. డైలమా అసలు వద్దు. కొంత నచ్చి, కొంత నచ్చకపోయినా ఇబ్బందే. అంతా నచ్చి కూడా నచ్చినట్టుగా బ్రతకడానికి సరైన ప్రయత్నం లేకపోయినా ఇబ్బందే. (అంతా నచ్చి కూడా నచ్చినట్లుగా బ్రతకడానికి సరైన ప్రయత్నం లేకపోయినా ఇబ్బందే). ఇది మనకు నచ్చింది అన్నపుడు దానికి తగిన ప్రయత్నం మన నుండి జరగాలి. నిరంతరం జరగాలి. మనం దాని వాళ్లముగా బ్రతకాలి. (తండ్రికి తగ్గ బిడ్డలు కండి – శ్రీసాయి) మనం ఈ ఉద్యమానికి సంబంధించిన వాళ్ళం అనుకున్నపుడు ఏ పనులైనా ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని చేయాలి. అది చిన్న పని అవనీయండి. పెద్ద పని అవనీయండి. ఉద్యమానికి చిన్న, పెద్ద తారతమ్యం లేదు. ఉద్యమ అవసరాన్ని బట్టి మన జీవిత సన్నివేశాలన్నీ రూపుదిద్దుకోవాలి. అపుడే మనం ఉద్యమకారులం కాగలుగుతాం. అలా జరుగనినాడు మనకు మంచి ఉద్దేశం ఉంటుంది తప్ప, అది మంచి ఉద్యమంగా రూపుకట్టదు. ఉద్దేశం ఉద్యమరూపం ధరించేవరకు మనం విశ్రమించకూడదు. అలా ఉద్యమరూపం ధరించేందుకుగాను మన జీవితాన్నో దీక్షగా స్వీకరించవలసి ఉంటుంది.

**– గురుకృప**

## పూజ్య శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ సత్సంగభాషణలు

## 6 జనవరి 1991, హైదరాబాద్

**ప్రియమైన సాయిపథం కుటుంబసభ్యులకు, అశేష సాయిభక్తులకు...**

జనవరి 6, 1991 ఆదివారంనాడు "శ్రీసాయిపూజోత్సవాలు" సాయిబాబా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, హైదరాబాదులోని గోకుల్ ఫంక్షన్ హాలులో వైభవంగా నిర్వహించబడ్డాయి. ఆ రోజు సాయంత్రం ముస్లిం, హిందూ సాంప్రదాయానుసారం ప్రార్థన జరుపబడినది. తదనంతరం శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ తమ ఉపన్యాసంలో... శ్రీసాయితత్త్వం బాహ్యాచారాలకు పరిమితమైన మత, కులతత్వానికి అతీతమైనదని, సర్వజీవులలో ప్రకాశించే చైతన్యస్వరూపుడైన భగవంతుని దర్శింపజేయడమే శ్రీసాయి అవతారకార్యం యొక్క ప్రయోజనమని, వారు జీవించి ఉన్నప్పుడు కూడా, తాను ఆ దేహానికి పరిమితుడు కాదనే విషయాన్ని తమ లీలల ద్వారా అందరికీ సులభంగా అవగాహన అయ్యే రీతిలో వ్యక్తం చేశారని, బాబా మతసామరస్యానికి ఒక ప్రతీకయని, వారు తన వద్దకు వచ్చిన హిందూ, ముస్లిం భక్తులలోని మత మౌఢ్యాన్ని అతి సున్నితంగా తొలగించేవారని,



అదే రీతిలో తాము అగ్రకులానికి చెందినవారమనే దురభిమానులను కూడా మందలించి, తమ లీలలతో వారిని చక్కదిద్దారనీ వివరించారు. ఈ విధంగా బాబా యొక్క ప్రతి లీలను చక్కగా అవలోకిస్తే, బాబా సర్వాంతర్యామి అన్న విషయం పదే పదే నిరూపణ అవుతుందని, అందువల్లనే ఈ రోజుకూ బాబా లీలలు దినదిన ప్రవర్ధమానంగా అశేష ప్రజానీకానికి అనుభవమవుతున్నాయనీ సవివరంగా తెలియజేశారు. సాయి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఆనాటి కార్యక్రమం భజన, ఆరతులతో సమాప్తమైంది. సాయిభక్తులకు ఎంతో అమూల్యమైన ఆ సత్సంగాన్ని ఇప్పుడు మనం సవివరంగా పూజ్యగురుదేవుల మాటల్లో ఆస్వాదిద్దాము. **– సాయిపథం టీమ్**

సాయితత్త్వంలో ప్రధానంగా సాయి యొక్క లీల, సాయి యొక్క బోధ అనేటువంటివి రెండుగా లేవు. 'సాయి'... లౌకికంగా చూసేటటువంటి మనకు, లౌకికులకు ఆయన ఇన్ని మహిమలు, ఇన్ని మిరాకిల్స్ చేసినటువంటివారు, అబ్బా, ఎంత అద్భుతమైన వ్యక్తి అని మనకనిపిస్తుంది. కానీ ఆయనను ఆధ్యాత్మికమైనటువంటి ఆ కోణంలో నుండి చూసినప్పటికి కూడానూ ఆయన ఒక మహాద్భుతం. ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో ఎందరో మహనీయులు ఉద్భవించారు. వాళ్ళు ఆదర్శప్రాయమైనటువంటి జీవితాన్ని గడిపారు. ఎట్లా గడపాలనేటువంటే దాన్ని మనకు బోధించారు. వాళ్ళ బోధ, వాళ్ళ జీవితమనే ఆచరణ.. రెండున్నాయి. కానీ 'బాబా' విషయానికొచ్చేటప్పటికి ఏమవుతోంది? ఆయన ఎప్పుడూ కూడానూ ఎక్కడా లెక్చర్స్ ఇవ్వలేదు, ఒక పుస్తకం వ్రాయలేదు, సత్సంగాలు చేయలేదు, గోష్టులు నిర్వహించలేదు, వేదాంతాల గురించి అసలేమీ మాట్లాడలేదు. అయినప్పటికీ కూడానూ ఆయన శిరిడీలో పదహారేళ్ళ బాలుడుగా కనిపించి, 1918 లో సమాధి అయ్యేంతవరకు ఆయన చేసినటువంటి ప్రతి చర్య కూడానూ ఒక బోధ, ఆయన తత్త్వాన్ని గురించి! కాబట్టి సాయి యొక్క లీలను, సాయి యొక్క తత్వాన్ని వేరుపరిచి, ఇది సాయి యొక్క జీవితచరిత్ర, ఇది సాయి యొక్క బోధ అని చెప్పడమనేటువంటిది చాలా కష్టమైన విషయం. పువ్వుకి సహజంగా పరిమళం ఎట్లా ఉంటుందో, చక్కెరకి తీపి ఎట్లాగైతే ఉంటుందో... అట్లాగే బాబా జీవితానికి చెందినటువంటి ప్రతి అణువణువులో కూడానూ ఆయన యొక్క బోధ ఉంటుంది. ఆయన రూపం, ఆయన ఎట్లా ప్రకటమయ్యారు, ప్రతి కదలికా ఒక సత్యాన్ని మనకు తెలుపుతుంది. ఎలాగ?

మొట్టమొదట, బాబా ఎలా ప్రకటమయ్యారు అనే విషయం తెలుసుకుందాం. బాబా ప్రకటమయ్యేటువంటి పద్ధతిలోనే ఒక విచిత్రం ఉంది. ఆయన తల్లిదండ్రులెవరో ఎవరికీ తెలియదు,



పుట్టుపూర్వోత్తరాలు తెలియదు, ఆఖరికి పేరైనా తెలుసా అంటే ఎవ్వరికీ పేరు కూడా తెలియదు. 'సాయిబాబా' అనేటువంటిది ఆయన పేరు కాదు. ముస్లిమ్ ఫకీర్లని 'సాయీ' అంటారు. 'సాయి', గోసాయిలంటామే మనం, వైష్ణవులుగా ఉండేటువంటి వాళ్ళని, వైష్ణవ సాధువులను గోసాయిలంటాం. అట్లాగే ఈ సూఫీ సాధువులని 'సాయి' అనే సాంప్రదాయం ఉన్నది. ఈ సాంప్రదాయం ప్రకారంగా ఆయన శిరిడీలో ఒకసారి కనిపిస్తే, చూసేదానికి ముస్లిమ్ లాగా ఉన్నారాయన... "ఆయియే సాయి" అన్నాడు మహల్సాపతి.. ఆయన ఒక 'సాయి', 'స్వామి' అని అర్థం. అంతే! మామూలుగా మహాత్ములని మనం 'స్వామీ' అన్నట్లుగా. అక్కణ్ణుంచి ఆ ఊర్లో ఉన్న వాళ్ళందరూ 'సాయి, సాయి' అనడం మొదలు పెట్టారు. తర్వాత 'బాబా' అనేటువంటిది పెద్దవాళ్ళకు మనం గౌరవం ఇచ్చే పదం కనుక 'బాబా' 'అన్నారు. అలా 'సాయిబాబా' అయింది.

బాబాను గురించిన వివరాలు ఆయన నోటిగుండా ఆయన ఎప్పుడూ చెప్పలేదు, ఎవ్వరికీ తెలుసుకునే అవకాశం కూడా కలగనివ్వలేదు... మొత్తం బాబా చరిత్రలో చూస్తే! ఎందుకంటే ఎవ్వరికీ ధైర్యం లేదు, ఆయన దగ్గరకు వెళ్ళి, "బాబా, మీ పేరేమిటి? మీ పుట్టుపూర్వోత్తరాలేమిటి? మీ తల్లిదండ్రులెవరు?" అనడిగేటువంటి ధైర్యం ఎవ్వరికీ లేదు. ఒక్కసారి మాత్రం ఆ అవకాశం వచ్చింది. ఒకసారి అక్కడ ఒక దొంగతనం జరిగింది. పోలీసులు ఆ దొంగను పట్టుకున్నారు. పట్టుకొని తీసుకొచ్చి, ధూలియా కోర్టులో ప్రవేశపెట్టారు. "ఎక్కడివిరా నీకీ నగలు?" అనడిగారు కోర్టులో, "నాకు శిరిడీలో ఉండే సాయిబాబా ఇచ్చారు" అన్నాడతడు. వెంటనే మామూలుగా కోర్టు ప్రొసీజర్ ప్రకారంగా "సాయిబాబాకు సమన్లు చేయండి" అన్నారు, కోర్టులో ప్రవేశపెట్టండి అన్నారు. సమన్లు గణపతిరావు అనేటువంటి ఒక కానిస్టేబుల్ కి ఇచ్చి శిరిడీకి పంపించారు. అప్పుడు అక్కడ పెద్ద పెద్ద లాయర్స్ ఉన్నారు. 'బూటీ'లాంటి సంఘంలో చాలా గొప్ప పేరుప్రతిష్టలు కలిగినటువంటి భక్తులందరూ ఉన్నారు. వాళ్ళందరూ కలసి జడ్జిగారికి ఒక అర్జీ పెట్టుకున్నారు. "సాయిబాబా ఒక గొప్ప మహాత్ముడు, ఔలియా. ఆయన ఎక్కడికీ, శిరిడీ దాటి ఎక్కడికీ బయటికి వెళ్ళరు, కాబట్టి ఆయన దగ్గర నుండి ఏదైనా విచారించదలచుకున్నట్లయితే, మీరే వచ్చి బాబా దగ్గర కూర్చొని, బాబా దగ్గర నుంచి వివరాలు తీసుకోవచ్చు. మీరు కమీషనర్‌ని ఎవరినైనా పంపించండి" అని అన్నారు. దానికి కోర్టు యాక్సెప్ట్ చేసి, అంగీకరించి ఏం చేశారంటే, ఒక ప్రతినిధిని పంపించారు. జోషి అనే ఒక ప్రతినిధి వచ్చాడు బాబా దగ్గరికి. అతనికీ భయమే. "బాబా, నా ఉద్యోగ ధర్మంగా



నేను మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడుగుతున్నాను, అంతకు మించి ఇంకేం లేదు, నన్ను క్షమించవలసినది" అని చెప్పి ముందు దణ్ణం పెట్టుకున్నాడు. "ఆ, అడుగు. దానికేముంది? అల్లామాలిక్ హై" అన్నారు బాబా. ఆపైన చెప్పడం మొదలు పెట్టారు. అతడు "మీ పేరేమిటండీ" అనడిగాడు. మామూలు కోర్టులో అడుగుతుంటారే, పేరు తెలిసినా సరే, ఫలానావాళ్ళని రమ్మని చెప్పి ఇక్కణ్ణుంచి పిలుస్తుంటారు. వాళ్ళు బోనులో ఎక్కగానే, మళ్ళీ లాయర్ అడుగుతుంటాడు. "మీ పేరేమిటండీ?" అని. అట్లా, "మీ పేరేమిటి?" అన్నాడతను. "వీళ్ళందరూ నన్ను 'సాయిబాబా' అంటారు" అన్నారు బాబా. అంతే తప్పితే నా పేరు ఇదీ అని చెప్పలేదాయన. "మీ తండ్రిగారి పేరు?" అన్నాడతను. "సాయిబాబానే" అన్నారు బాబా. "మీ మతమేమిటండీ?" అన్నాడు. "కబీరు" అన్నారు బాబా. తమాషా ఏమిటంటే హిందువా, ముస్లిమా అనేటువంటి విషయం తేలకుండా ఇప్పటివరకు ఆధ్యాత్మిక చరిత్రలో ఉండేటువంటి ఒకే ఒక వ్యక్తి ఎవరంటే, అది "కబీరు". హిందూ భక్తులు కబీర్‌ని హిందువంటున్నారు. ముస్లిమ్ భక్తులు కబీర్‌ని ముస్లిమ్ అంటున్నారు. ఆయన ముస్లిమ్ గానే ప్రకటమయ్యాడు, "రామ్, రామ్" అన్నాడు. ఈరోజుకీ ఆ వివాదం అట్లాగే ఉంది. ఆయనెవరో ఇంతవరకు పండితులకే తేలడం లేదు! "నాది కబీరు మతము" అన్నారు బాబా. "సరే మీ కులమేమిటండీ?" అనడిగాడు. "పర్వర్ధిగర్" అన్నారు. అంటే భగవంతుని కులం.

సరే, ఈయన దగ్గర నుంచి ఇన్ఫర్మేషన్ ఏమీ వచ్చేటట్టు లేదే అనుకుని ఇక డైరెక్ట్‌గా సబ్జెక్ట్‌లోకి వచ్చాడు. "ఏమిటండీ, మీకు ఫలానా వ్యక్తి తెలుసా?" అనడిగాడు. "ఓ.. తెలుసు" అని, "నాకందరూ తెలుసు" అన్నారు బాబా వెంటనే. ఓ, తెలుసు అనగానే, అమ్మా, చిక్కాడురా అనుకున్నారు వీళ్ళు. "నాకందరూ తెలుసు" అన్నారు బాబా. ఆయన నెక్ట్స్ స్టేట్‌మెంట్ అది. సరే, అదీ వ్రాసుకున్నాడు. "ఫలానా వాడికి, ఫలానా నగలు మీరిచ్చారా?" అనడిగాడు. "ఇచ్చాను" అని, "అందరికీ అన్నీ నేనే ఇస్తుంటాను" అని అన్నారు. "అతనికి నగలివ్వడం ఏమిటి ఖర్మ? జీవులందరికి కూడానూ, అందరికీ నేనే ఇస్తూ ఉంటాను" అన్నారు. ఏం వ్రాసుకుంటాడు? ఇదంతా తేలేటట్టుగా లేదే అనుకున్నాడు. అయినా ఇంకొక ప్రశ్న వేద్దామనుకొని... "మీ వయస్సెంతండీ?" అన్నాడు. "కొన్ని లక్షల సంవత్సరాలు" అన్నారు బాబా. ఏం వ్రాసుకుంటాడు కోర్టు రికార్డ్స్‌లో ఇవంతా కూడానూ! కొద్దిగా ఇదయ్యి, "సరిగ్గా చెప్పండి" అన్నాడు. అనేటప్పటికి, బాబా "నేనెప్పుడూ ఈ మసీదులో కూర్చొని అబద్ధం చెప్పను. జావ్ రే" అనేసి లేచి వెళ్ళిపోయారు. ఇక తర్వాత దేనికీ సమాధానం చెప్పలేదు.



కోర్టు రికార్డ్‌లో ఉన్నది ఇది. ఆ తర్వాత వాళ్ళకే తేలింది. ఆ దొంగ అసలు శిరిడీకే రాలేదని, వాడు ఇంకెక్కడో తీసుకొని వచ్చి నోటికొచ్చినట్టుగా "సాయిబాబా" పేరు చెప్పాడని తర్వాత నిరూపణ అయింది. ఆ తర్వాత వాడికేదో శిక్ష వేశారు. అది తేలిపోయింది. అది వేరే విషయం.

ఈ సంఘటన యొక్క ప్రాముఖ్యం ఏమిటయ్యా అనంటే, బాబాను గురించి బాబాని, "మీ తల్లిదండ్రులెవరు? మీ పుట్టుపూర్వోత్తరాలేమిటి?" అని అడగగలిగినటువంటి ఒకే ఒక సంఘటన అది. అంతకుమించి ఆయన నోటిగుండా చెప్పినటువంటి వివరాలు ఏమీ లేవు. ఒకవేళ ఎప్పుడైనా నేను ఫలానా దగ్గర నుంచి వచ్చాను, ఫలానా దగ్గర నా గురువును చూశానని ఆయన చెప్పినా, వాటికి ఒకదానికి, మరొకదానికి పొంతన కుదరదు. కాబట్టి మనకి ఇదమిత్థంగా, కరెక్ట్‌గా ఆయన చెప్పినటువంటి మాటలేమైనా ఉన్నాయా? పోనీ ఆయన యొక్క వేషభాషలు చూసి ఏమైనా కనిపెడదామా?... మనకు చాలా ఇంట్రెస్ట్ ఇది. ఎందుకనంటే ముందు మనకు ఎవరైనా మనిషి కనిపించగానే, వాడు మనిషా అని చూడము. మీరు ఏమిటోళ్ళండి, మీది ఏ మతమండీ? అది మనం అడిగే ప్రశ్న. మనకు ముందు కావలసింది అది. వాడు ఏమిటి? మన బ్రాహ్మణుడేనా? లేకపోతే మన బలిజేనా? మన శూద్రుడేనా? మన వైశ్యానేనా?... ఇవి. కాబట్టి ముందు అది మనం తెలుసుకోవాలి. తెలుసుకోకపోతే మనకు నిద్ర పట్టదు. పోనీ వేషం చూద్దామా అనంటే ఫక్తు ముస్లిమ్‌లాగా ఉన్నారు. ముస్లిమ్ ఫకీరులు ఎట్లా ఉంటారో అట్లాగే ఉన్నది ఆయన వేషం. తలకు గుడ్డ కట్టుకోవడం గురించి చాలామంది ప్రశ్న వేస్తారు. కొంతమంది హిందూ దురభిమానులు ఆయన తల మీద బిల్వపత్రం పెట్టుకొని, దాని మీద గుడ్డ కట్టుకునేవారని కూడా ప్రచారం చేస్తున్నారిప్పుడు. ఆయన బిల్వపత్రం పెట్టుకోగా ఎప్పుడూ, ఎవరూ చూడలేదు. ఆయన తలగుడ్డ విప్పగా ఎవరూ చూడలేదు. తలగుడ్డ ఎందుకు కట్టుకుంటారు అనంటే నమాజు చేసేటప్పుడు ముస్లింలు తలమీద గుడ్డ వేసుకుంటారు. ప్రార్థన చేసేటప్పుడు తలమీద గుడ్డ కప్పుకుంటారు. నమాజు చేసేటప్పుడు పైన ఒక తలగుడ్డ వేసుకుంటారు. అంటే ఏంటి? భగవంతునికి 'శరణాగతి' పొందడమని అర్థం. తలమీద గుడ్డ వేసుకున్నప్పుడు, ఇంతకంటే ఇంకెవరూ లేరు, నీకు దాసానుదాసుణ్ణి అని తలవంచడం. ఎవరైతే భగవంతుడికి శరణాగతుడో వాడే ముస్లిమ్. 'ముస్లిమ్' అనే పదానికి అర్థమది. ఎప్పుడూ శరణాగతి పొందినటువంటి వారాయన. సదా శరణాగతుడు భగవంతునికి. కాబట్టి నేను ఎప్పటికీ తలగుడ్డ విప్పను, నేను సదా నమాజులో, సదా నిష్టలోనే ఉన్నాను అని

చెప్పేదానికి సంకేతం ఆయన తలగుడ్డ. ఇట్లా ముస్లిమ్ ఫకీర్లలో ఉండేటువంటి సాంప్రదాయం తలకి గుడ్డ కట్టుకోవడమనేది.



ఆయన దగ్గర ఏ వస్తువులూ లేవు. ఆయన శిరిడీకి వచ్చినపుడు, ఆయన దేహాన్ని 1918లో వదలిపెట్టినపుడూ ఆయన ఆస్తిపాస్తులు ఏమన్నా ఉన్నాయా అంటే, ఆయన వేసుకున్నటువంటి కఫ్నీ, కఫ్నీ అంటే అంగరఖా, తలగుడ్డ, చిలుము పట్టినటువంటి ఒక ఇనుప డబ్బా, సాధువుల దగ్గర ఎప్పుడూ ఒక కర్ర ఉంటుంది. సన్యాసులు కానివ్వండి, సాధువులు కానివ్వండి, ఫకీర్లు కానివ్వండి... ఒక కర్ర, జోలెలో ఒక ఇటుకరాయి. బాబా పడుకునేటప్పుడు ఎప్పుడూ కూడా ఇటుకరాయి తలక్రింద పెట్టుకుని పడుకునేవారు. భిక్షకు పోయినప్పుడు జోలెలో భిక్షగా వచ్చిన రొట్టెముక్కలు వేసుకునేవారు. సబ్జాల్లాంటివి, కూరలుగాని, పులుసులు లాంటివిగానీ వేస్తే ఆ డబ్బాలో పోసుకునేవారు. మసీదుకు తీసుకువచ్చి అక్కడ ఎక్కడైనా ఒక దగ్గర పెట్టేవారు. కుక్కలు, పిల్లులు ఏవి బడితే అవి వచ్చి తింటుండేవి. అవి తినగా మిగిలినటువంటివి ఆయనకు ఆకలైనప్పుడు లేచి వెళ్ళి, ధునిలో ఒక ముక్క వేసి మిగతాది ఆయన తినేసేవారు. అది ఆయన యొక్క తిండి, చివరిదాకా అదే ఆయన యొక్క ఆహారం.

ఎప్పుడూ కూడా బాబా, "అల్లామాలిక్ హై, అల్లామాలిక్ హై" అని అనుకుంటూనే ఉండేవారు. భగవంతుని గూర్చి ఆయన ఎప్పుడు ప్రస్తావన తెచ్చినా, భగవంతుడిని "అల్లా" అనే సంబోధించేవారు. ఇంకోమాట ఆయన ఎప్పుడూ సంబోధించలేదు. ఎప్పుడైనా "పర్వర్దిగర్" అనేవారు. సూఫీ సాధువులు ఉపయోగించేటువంటి పదాలే ఇవన్నీ కూడానూ. ఒక సాధువుకి చెప్పారు, "నెవాసాలో ఉండేటువంటి మోహినిరాజ్‌ని (మోహినిరాజ్ అంటే శివుడు) దర్శనం చేసుకో పో" అన్నారు. ఆయన చెప్పిన మాట ఏమిటంటే "మోహినిరాజ్‌ని చూడు పో, అల్లా సగుణరూపంలో అక్కడ ఉన్నాడు" అని. అల్లా సగుణరూపంలో, ఈశ్వరరూపంలో అక్కడ ఉన్నాడట! ఎవరన్నా వచ్చి బాబాకు నమస్కారం చేశారు, ఆయన వాళ్ళకి ఆశీర్వాదం చేయాలంటే, "అల్లా అచ్చా కరేగా", "అల్లా భళా కరేగా" అనేవారు. ఎప్పుడు భగవంతుని గురించి చెప్పినా "అల్లా", "అల్లా మాలిక్ హై" అనేవారు.

ఆయన ముస్లిం అనేటువంటి ఉద్దేశ్యంతో ఆయనను తీసుకువచ్చి ఒక పాడుబడిన మసీదులో ఉండమన్నారు గనుక మసీదులో ఉన్నారు. ఆయన దగ్గర ఎప్పుడు కూడానూ అగ్నిహోత్రం ఉండేది. ఆయన మసీదులో కాదు అగ్నిహోత్రాన్ని ప్రారంభించింది. ఆయన శిరిడీ వచ్చి వేపచెట్టు



క్రింద కూర్చున్నప్పుడే అగ్నిహోత్రం ప్రారంభం చేశారు. ఆ తరువాత వెళ్ళి మసీదులో ఉండమన్నారు, మసీదులో కూడా అగ్నిహోత్రం పెట్టారు. ఆయన ఎక్కడ ఉంటే అక్కడ అగ్నిహోత్రం ఉండాలి. ఇదెక్కడ ఆచారం? చూసేదానికి ముస్లింలా ఉన్నారు, వేషభాషలూ ముస్లింలా ఉన్నాయి, మాట్లాడే మాట అట్లాగే ఉంది, మాట్లాడేటప్పుడు ఆయన హిందూ దేవతల గురించి ఎప్పుడైనా ప్రస్తావన చేసినట్లైతే అరబిక్, పర్షియన్ బాగా ఉండేటువంటి ఆ దేశాలలో ఉండి వచ్చినటువంటి వాళ్ళు ఎట్లాగైతే ఉచ్చరిస్తారో అట్లా ఆ పదాలు కూడా. 'విష్ణు'... సరిగ్గా రానివాళ్ళు ఎట్లా చెబుతారో ఆ టైపులో ఉచ్చరించేవారు. వచ్చిన కొత్తల్లో అరబిక్, పర్షియన్ మంత్రాలు ఏవో చదివేవారు. అది ఎవరికీ ఏమీ అర్థమయ్యేది కాదు. తాకియాలోకి వెళ్ళి ఆయన నృత్యం చేస్తూ భజన చేసేవారు. సూఫీ సాంప్రదాయంలో ఒక భాగమది. ఆ తన్మయత్వం కోసంగా భజన చేస్తూ, భగవంతుని కీర్తన చేస్తూ నృత్యం చేస్తారు. భగవంతుణ్ణి కీర్తిస్తారు. అట్లా భగవంతుణ్ణి కీర్తించేవారాయన. ఆయన మొత్తం జీవితంలో ఎప్పుడూ కూడానూ సంధ్యావార్చుడంగాని, ఒక మంత్రం చదవడంగాని, ఇటువంటివి ఎప్పుడూ ఏమీ చేయలేదు. సంస్కృత మంత్రాలు ఏవీ కూడా ఉచ్చరించలేదు. ఎప్పుడైనా ముస్లింలు వచ్చి, ఏదైనా నైవేద్యం పెట్టి, ఫాతియా చదవమని చెబితే, అందరితోపాటు ఆయనా ఫాతియా చదివేవారు. మొట్టమొదటి రోజులలో సంగమనేరు, ఆ చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి ఎవరైనా ముస్లింలు వచ్చి నమాజు చేయమంటే వాళ్ళతో పాటే ఆయనా నమాజు చేసేవారు. మామూలుగా ఇస్లాం సాంప్రదాయంలో రెండు రకాలైన సాంప్రదాయాలు ఉన్నాయి. ఇస్లాంలో, బాహ్యంగా మనం మామూలుగా పాటించేటువంటి మతం ఒకటి, ఆధ్యాత్మిక స్థితిని పొందే ఒక రహస్యమైన సాధనామార్గం అనేటువంటిది రెండవది. వీళ్ళలో ఉండేటువంటి సాధనా మార్గంగాని, సాధనా ఉపదేశంగానీ బయట ఇంక ఎవరికంటే వాళ్ళకు చెప్పరు. జన్మత: ముస్లిం అయితే తప్పితే ఆ ఉపదేశాలు అలా చెప్పరు, అవి బయటకు ఇవ్వరు. సాయిబాబా అనేటువంటి ఒక ఫకీరు శిరిడీలో ఉన్నారు అనేటువంటి విషయం ఎట్లా తెలిసేదో మనకు తెలియదుగాని, మక్కా నుంచి, అరేబియా దేశం నుంచి కూడా కొంతమంది ఔలియాలు బాబా దర్శనం చేసుకోవడానికి, బాబా దగ్గర ఉపదేశం పొందడానికని శిరిడీకి వస్తుండేవారు. ఏం పొందేవారో ఏమిటో ఎవరికీ తెలిసేది కాదు, ఎందుకంటే అది రహస్యంగానే ఉండిపోయేది. కాబట్టి ఇవన్నీ చూసినట్లైతే ఈయన ముస్లిం అయ్యేదానికి అవకాశం ఉందా? అనే ఒక అనుమానం వస్తుంది. కానీ ఆయన అగ్నిహోత్రం పెట్టారు, ఆయన ఉండేటువంటి మసీదును 'ద్వారకామాయి'



అని అన్నారు. హిందువులు భజన చేస్తే ఆయనా కలసి భజన చేసేవారు. ద్వారకామాయికి ఎవరైనా వచ్చి "ఆరతి జ్ఞానరాజా" అని జ్ఞానేశ్వరుని ప్రార్థన చేస్తే ఆయన చేతులెత్తి దణ్ణం పెట్టేవారు. "ఆరతి తుకారామా" అంటే తుకారామ్ కి చేతులెత్తి దణ్ణం పెట్టేవారు.

బాబా తప్పనిసరిగా ముస్లిమే అనే అభిప్రాయంతో వచ్చిన ఒక భక్తునితో, "వీడు సద్బ్రాహ్మణుడు, ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాది మందిని శుభ్రమార్గంలో నడిపిస్తాడు" అన్నారు బాబా. మామూలుగా సామాన్యంగా ముస్లింలు చేసేటువంటి ఐదు పూటల నమాజు చేయడంగానీ, ఈ పద్ధతులుగానీ ఏమీ లేవు ఆయన దగ్గర. పోనీ అవన్నీ చేశారా అంటే అదీ లేదు, ఇది చేశారా అంటే ఇదీ లేదు.

ఇట్లా కాదు కనుక్కోవడం అని కొంతమంది కొంచెం తెలివి ఉండేటువంటి వాళ్ళు ఒక ఆలోచన చేశారు. ఈయనకు సున్తీగాని అయివుంటే తప్పనిసరిగా ఈయన ముస్లిం అయివుంటారు అనుకొన్నారు. అది ఎట్లా తెలుసుకుంటారు? తెలుసుకోవడానికి అవకాశం లేదు. ఆయన సమాధి అయిన తర్వాత అది తెలిసింది, ఆయన ప్రక్కగా ఉండేటువంటి పోలీసు కానిస్టేబుల్స్ చెప్పింది ఏమిటనంటే, ఆయనకు సున్తీ అయివున్నది అని. అబ్బా! తెలిసిపోయిందండీ రహస్యమంతా కూడానూ, బట్టబయలైపోయింది, ఈయన తప్పకుండా ముస్లిమ్ అని అనుకుంటే, ఆయనకు చెవులు కుట్టి ఉండేవి. జన్మతః హిందువు అయితే తప్పితే, ఆయనకు ఉపనయనమైవుంటే తప్పితే చెవులు కుట్టే క్వశ్చన్ లేదు. పోనీ హిందువు అంటామా? అక్కడా తేలలేదు. జీవితపర్యంతం కూడానూ ఎక్కడా ఆ పిడికిలి అట్లా విప్పలేదాయన, ఆయన హిందువా, ముస్లిమా అని! ఆయన హిందువే అని నమ్మకపోతే దణ్ణం పెట్టుకోలేని దౌర్భాగ్యం ఉండేటువంటి భక్తులకు... మనం ఆయన మహిమను చూసి దణ్ణం పెట్టాలి, కానీ ఊరికనే ముస్లిం అని దణ్ణం పెడితే బాగుండదు గనుక ఆయన సద్బ్రాహ్మణుడు కాబట్టి మనం దణ్ణం పెడదాం అని మనకు మనం జస్టిఫై చేసుకుని దణ్ణం పెట్టేటువంటి భక్తులకు, "నేను" ఫకీరును" అన్నారు, "అల్లా మేలుచేస్తాడు పో" అన్నారు. ఈయన మనవాడే, మన ఫకీరే, మన ముస్లిమే అని వచ్చేటువంటి వారితో, ''నేను బ్రాహ్మణుడిని" అన్నారు. ముస్లిం అనేటువంటివాడు... బాబా హిందువే, అయినప్పటికీ కూడానూ **ఆయనలో మహిమను చూసి దణ్ణం పెట్టుకోగలగాలి అనేటువంటి దీనితో, ఆ అడ్డుగోడను తొలగించుకొని వచ్చే నమస్కారం చేయాలి అనేదాన్ని ఇన్సిస్ట్ చేశారు. హిందువు అయినటువంటివాడు... బాబా ముస్లిం ఫకీరే, అయితే మాత్రం ఏం? మనం నమస్కారం చేయడానికి ఆయన మహిమ ముఖ్యం, ఆయన జన్మ**



**కాదు అని వెళ్ళి నమస్కారం. చేసేటువంటి సంస్కారం కలిగించారు.** ఇదీ మొట్టమొదట ఆయన ఇన్సిస్ట్ చేసింది. అక్కడ మాత్రం ఆయన ఎక్కడా వీసమంత, ఒక్క వెంట్రుక వాసి కూడా ఎక్కడా అటువంటి ఛాన్స్ ఇవ్వలేదు.

ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో ఎందరో మహానుభావులు రకరకాల మతాల సాధనలు చేశారు. రామకృష్ణ పరమహంస ఉన్నారు... అన్ని మతాల యొక్క సాధనలూ చేశారు. ఇస్లాం మతం చేశారు, బౌద్ధం చేశారు, క్రిస్టియానిటీ చేశారు. అన్ని రకాల సాధనలూ చేసి అన్ని మతాల యొక్క పరమైన లక్ష్యం ఒక్కటేనూ, ఆ సర్వమైనటువంటి అనుభూతి ఒక్కటేనూ అని ప్రతి ఒక్కరికీ ఆయన చాటిచెప్పారు. వారికి మతాభిమానంగాని, ద్వేషంగానీ ఏ కోశానా లేవు. అయినప్పటికీ రామకృష్ణ పరమహంస జన్మతః బ్రాహ్మణుడు అనేటువంటి విషయం మనకు తెలుసు గనుక, ఆయన ఫలానా గుడిలో పూజారి అనే విషయం తెలుసు గనుక సాంప్రదాయమైనటువంటి ముస్లింలు వెళ్ళి దణ్ణం పెట్టడానికి జంకుతారు.

తాజుద్దీన్ బాబా లాంటి మహాత్ములు ఉన్నారు, వాళ్ళు గొప్ప ఔలియాలు, సిద్ధులు. అయినప్పటికీ జన్మతః వాళ్ళు ముస్లిం అనే విషయం తెలుసు గనుక ఆచారం, నిష్ఠ ఉండేటువంటి హిందువులు వెళ్ళి ఆయనకు దణ్ణం పెట్టాలంటే ఏడుస్తారు. కాబట్టి వాళ్ళ జన్మ రహస్యం తెలియడంవల్ల ఏమవుతోంది? ఈ అడ్డు వస్తూనే ఉంది. ఎంత మనం అనుకున్నాసరే ఆ సాంప్రదాయం అడ్డువస్తోంది. బాబా దగ్గర ఆ సాంప్రదాయం లేదు. ఎందుకంటే ఆయన ఎవరో ఈరోజు వరకూ తెలియదు. ఆయన హిందువు అనడానికి ఎన్ని ఆధారాలున్నాయో, ఆయన ముస్లిం అనడానికి అన్ని ఆధారాలు ఉన్నాయి. త్రాసు ఇట్లా పెడితే వీళ్ళు వచ్చి దణ్ణం పెట్టడానికి ఎట్లా కరక్టుగా ఉంటుందో, అట్లా పెడితే వాళ్ళు అంతేమంది వచ్చి దణ్ణం పెడతారు. ముస్లింలకు ముస్లింలాగా ప్రకటమవడం, హిందువులకు హిందువులాగా ప్రకటమవడం కాదు అక్కడ ఆయన చేసింది. అక్కడ తమాషా ఏమిటంటే – హిందూ మతోన్మాదులకు ముస్లిం క్రింద ప్రకటమవడం మొదలు పెట్టారు. ముస్లిం మతోన్మాదులకు హిందువులాగా ప్రకటమవడం మొదలుపెట్టారు. ఎందుకని? **ఆ మతం అనే అడ్డుగోడ పోగొట్టాలని.** వాడు హిందువు కాబట్టి నేను హిందువునే, రా... నాకు దణ్ణం పెడుదువు, రా అని ముషావర్ చెయ్యలేదు. ముస్లింలకు, నేనూ మన ఫకీరునే, మనం మనం ఒకటే, రా... అని చెప్పలేదు. **ఆ దురభిమానం పోగొట్టుకుంటేనే నా దగ్గరకు రా, లేకపోతే జావ్** అన్నారు.



ఇక కులాభిమానం సంగతి, అంటరానితనం గురించి అయితే... బాబా మొత్తం జీవితచరిత్రలో ఎప్పుడైనా సరే, ఎవరి యొక్క దౌర్బల్యాన్నైనా, బలహీనతలనైనా అందరి మహాత్ముల్లాగానే ఆయనా సానుభూతితోనే చూశారు. బలహీనతలు అందరిలోనూ ఉన్నాయి. బలహీనతలు లేనివారెవరు? Nobody is perfect except God! ఎవరు పరిపూర్ణుడు? బాబానే పరిపూర్ణులు. అంతటి పరిపూర్ణత ఎవరిలో వస్తుంది? మనందరిలోనూ బలహీనతలు ఉన్నాయి. కానీ ఈ బలహీనతలను ఆయన ఎప్పుడూ కూడానూ కోపంతో దండించలేదు, ఒక్క బలహీనతను తప్ప! అది కులాభిమానం. నేను బ్రాహ్మణుడిని, నేను ఫలానా అని ఎవడన్నా గాని అనుకున్నాడా – వాడిని చీల్చి చెండాడేసేవారు. అంతే, ఇంకేమీలేదు.

వాడిని మసీదు మెట్లు ఎక్కనిచ్చేవారు కాదు, అక్కడ నుంచి తరిమివేసేవారు. అంటరానితనాన్ని పాటించేవాడిని అంటరానివాడిగానే చూడాలనేవారు. ఎవడయ్యా అంటరానివాడు అనంటే, **"నన్ను అంటకు, అంటకు" అనేవాడే అంటరానివాడు.** వాడికి వాడే డిక్లేర్ చేసుకుంటున్నాడన్నమాట, నన్ను ఎవరూ అంటకండి అని మడి కట్టుకొని, "నేను అంటరానివాడినయ్యా, నన్ను ఎవరూ తాకకండి, నన్ను ఎవరూ తాకకండి" అని చెప్పుకుంటున్నాడన్న మాట. కాబట్టి వాడిని అట్లాగే చూడాలిరా అని అన్నారు. వాడికి వాడే చెప్పుకుంటున్నాడు నేను అంటరానివాడిని అని. ఆయన ప్రధానంగా ఖండించింది ఆ కులాభిమానాన్నే. సాయి భక్తుడు ఎవరైనా సరే... నాది ఈ కులం, మీది ఏ కులం? మీరు ఏమిటోళ్ళు? అని అడిగాడంటే మనకు మనకే అవమానం, సాయికే అవమానం.

మనం ఈరోజు బాబాకి దణ్ణం పెట్టి నేను సాయి భక్తుడిని అని చెప్పుకుంటూ... మీ కులం ఏమిటండీ? నేను ఫలానా వాడినని చెప్పుకున్నారంటే మాత్రం అంతకంటే అవమానకర విషయం ఇంకొకటి లేదు. మొట్టమొదట సాయిభక్తిలో మనం నేర్చుకోవలసింది అది... ఆ అడ్డు తొలగిపోవాలి. **మనిషిని మనిషిగా గుర్తించాలి. మనిషిని మనిషిగా ప్రేమించాలి.** ఆ ప్రేమ నేర్పనటువంటి మతం అది హిందూమతంగాని, ఇంకొక మతంగాని. ఏ మతమైనా సరే దానిని తీసి దిబ్బలో కొట్టాల్సిందే! మనిషికి, మనిషికి అడ్డుగోడలు, ఏ మతం చెప్పినా సరే, ఆ అడ్డుగోడలను తొలగించుకోవాలి. అందుకనే బాబా అన్నారు "నీకు, నాకూ మధ్య ఉన్నటువంటి అడ్డుగోడను పడగొట్టు, అప్పుడు నువ్వే నేను, నేనే నువ్వు అని తెలుసుకుంటావు" అని. ఆయన ఎప్పుడూ ప్రధానంగా చెబుతుండేటువంటి మాట "అడ్డుగోడను పగలగొట్టు" అంటుండేవారు. ఆయన పదజాలం



అది. ఏమిటయ్యా ఆ అడ్డుగోడ అనంటే ఇదే, ఆ కులం అనేటువంటి అడ్డుగోడ. అదే ప్రధానమైనది. అనవసరమైనటువంటి అడ్డుగోడలివి. మనకు మనం మన అజ్ఞానంతో కల్పించుకున్న అడ్డుగోడలివి. ఆ రోజున ఆయన చెప్పినటువంటి తత్త్వం ఈ రోజున మనం చూస్తున్నాం... ఆ అడ్డుగోడ ఎంత దూరం పోతోంది, మనలో ఎంత మౌఢ్యానికి దారితీస్తోంది అని తెలుసుకోవడానికి ఈ రోజున హైదరాబాదు సిటీలో ఉన్నటువంటి వాళ్ళకు అది చక్కగా తెలుస్తుంది.

మనిషిని మనిషిగా గుర్తించి, మనిషిని మనిషిగా ప్రేమించలేనటువంటి దౌర్భాగ్యస్థితి మనకు దాపురిస్తున్నది. ఈ దౌర్భాగ్యం నుంచి మనలను కాపాడటం అనేటువంటిది బాబా ప్రకటమైనటువంటి అవతార కార్యంలో మొట్టమొదటిది. ఎందుకంటే ఆయన ఎట్లా అనే దాంట్లో కూడా ఒక సందేశం ఉన్నది.

సాయిలీల, సాయి యొక్క మహిమల్లో ఉండేటువంటి ఒక ప్రత్యేకమైన గుణం ఏమిటంటే ఆయన మహిమ యొక్క ఎఫెక్టు మనకు డైరక్టుగా రాదు, మన చుట్టుప్రక్కల ఉండేటువంటి వ్యక్తుల నుంచే వస్తుంది. మన చుట్టుప్రక్కల ఉండేటువంటి వ్యక్తులలో మనం ఎంతగా బాబాను గుర్తించగలిగితే అంత స్పష్టంగా బాబా మనకు ప్రకటమవడం మొదలు పెడతారు. ఆయన మహిమ ఇంకా ఇంకా ఎక్కువగా ప్రకటమవుతుంటుంది. అదీ బాబా లీలల్లో ఉండే మహిమ.

తరువాతది శరణాగతి. బాబా యొక్క తత్త్వం, ఆయన యొక్క స్వరూపం ఎట్లా చూడాలి? ఆయనకు ఎట్లా శరణాగతి పొందాలి? మనకసలు శరణాగతి పొందాల్సిన అవసరమేమిటి? దేని కోసం శరణాగతి పొందాలి? బాబా, నాకు ముక్తి కావాలి, బ్రహ్మజ్ఞానం కావాలి అని శరణాగతి పొందాలా? కానీ మనకెవ్వరికీ ఆ ముక్తితో అవసరం లేదే! ప్రపంచంలో ఎంతమందికి ముక్తి చాలా అవసరం? మనకు జేబులో ఉండే పది రూపాయలు అవసరంగాని, మనకు ముక్తి లేకపోతే ఇప్పుడు బ్రతకలేమా? అది తక్షణ అవసరమా మనకేమన్నా? కాదు. మన సంస్కారాలను boost up చేసుకునే దానికోసం మనం ముక్తి, ఆత్మజ్ఞానం, ఆత్మదర్శనం, భగవత్ సాక్షాత్కారం, బాబా దర్శనం... ఇటువంటి పదాలన్నీ ఊరికే ఉపయోగపెడుతుంటాం. అంతే! అది ఎట్లా ఉంటుందో తెలియదు. పోనీ ఎప్పుడన్నా అనుభవించి ఉంటే, భలే బాగుందిరా ఇది అనుకోవచ్చు. ఒక సినిమా చాలా బాగుందంటే ఇది భలే బాగుంది అని రెండోసారి చూద్దామనుకోవచ్చు. ఒక పదార్థం తిన్నాము, భలే చక్కగా, రుచికరంగా ఉంది, రెండోసారి మళ్ళీ తిందాము అని మనస్సు వెంపర్లాడవచ్చు. కానీ మనం ముక్తిని ఎప్పుడూ



అనుభవించలేదే! మరి దాని గురించి మనకు అంత ఆరాటం ఎక్కడ నుంచి వచ్చింది? కాబట్టి ముక్తిని గురించి మనమెవరమూ ఆయనను దేనిగురించి అడుగుతాం? మనకు ఇప్పుడు ఉండేటువంటి అవసరాల గురించి అడుగుతాం. మనం ఆర్తులం. మనకు ఉద్యోగం కావాలి, ఇంట్లో కుటుంబ సమస్యలు తీరాలి, కూతుళ్ళకో, కొడుకులకో పెళ్ళిళ్ళు కావాలి, కూతురికి ఉద్యోగం కావాలి, మనకు ఫైనాన్షియల్‌గా ఇబ్బందులు తీరాలి, బిజినెస్‌లో ఉండేటువంటి ఇబ్బందులు తీరాలి... ఇవీ మనకు ఇమ్మీడియెట్ గా ఉండేటువంటి అవసరాలు. ***(మిగిలినది తరువాయి సంచికలో)***

***- శ్రీబాబూజీ అనుగ్రహభాషణం నుండి***

## గురుకృపాలహరి

**హరీ! నీ భక్తజనులతో, నిరుపమగతి జెలిమిసేయు నిమిషార్థముతో**

**సరిగాదు మోక్షమనిన, చిర శుభమగు మర్త్య సుఖము జెప్పగనేలా?**

నీ భక్తులతో చేసే అరనిమిషం సహవాసంతో మోక్షము కూడా సమానం కాదు. ఇక క్షణికాలైన లౌకిక సుఖాలను గూర్చి చెప్పేదేమిటి? అంటుంది భాగవతం. సాక్షాత్తూ ఈశ్వరుడు(రుద్రుడు) ప్రచేతసులకు చేసిన  ఉపదేశంగా భాసిస్తుంది. భగవంతుని కీర్తి అనే జలకణాలతో లోపలి, బయటి మాలిన్యాన్ని తొలగించుకున్న పవిత్రులైనవారు సత్పురుషులు. రాగద్వేషాలు లేని మనస్సు కలిగి, సర్వప్రాణులయందు దయతో చరిస్తూ, కపటం లేని వారి చరణ సహవాసాన్ని కలుగచేయడమే మమ్ము అనుగ్రహించడం. అన్ని జీవులలోనూ ప్రకాశిస్తూ, శాశ్వతమైన, స్వయంప్రకాశమైన నిన్ను తెలుసుకున్న ఆ సత్పురుష సాంగత్యం మమ్ము సంసారమును చీకటిమయంగా కాక సదా నిన్ను దర్శిస్తూ సాగే వెలుగు మార్గంగా భాసింపజేస్తుంది, అని మహాత్ముల సాంగత్యపు విశేషము మనలో భాగమయ్యేందుకు తెలియజెప్పింది భాగవతవాణి. పరిణామంలో పూర్ణత్వం వైపుగా పయనిస్తున్నామో, శూన్యం వైపుగా పరిగెడుతున్నామో తెలియని సందిగ్ధంలో ఉన్న మనిషిని పరిపూర్ణునిగా చేయడానికి "సముద్ధారణార్థం కలౌ సంభవంతం" అని సముద్ధరించడానికి సద్గురువుగా, సద్భక్తునిగా, సాటి మనిషిగా మాత్రం అవ"తరిస్తూ" తరింప చేయడానికి తపనతో తరలి వస్తున్న తేజోదీప్తి 'గురువు'.

**కలేర్ దోష-నిధే రాజన్। అస్తి హై ఏకో మహాన్ గుణః।**

**కీర్తనాద్ ఏవ కృష్ణస్య। ముక్త-సంగః పరం వ్రజేత్.**



రాజా! ఇన్ని దోషాలు ఉన్న కలియుగంలో ఒక మంచి గుణం కూడా ఉంది. పరమాత్మను ఒక్కసారి కీర్తిస్తే చాలు, అన్ని బంధాలను దాటి ఆ పరమాత్ముని పరమపదం చేరవచ్చు. ఇది కేవలం కలియుగంలోనే సాధ్యం అంటారు మూర్తీభవించిన జ్ఞానమునకు దీప్తి శుకమహర్షి.

గమనిస్తే మహాత్ముల ఆగమనం–లక్ష్యం మరచి కేవలం భౌతిక సంపదలే సమస్తమని తలుస్తూ మరు జన్మకు మరోసారి తయారవ్వాలని తపించిపోతున్న జీవులకు "ఇది కాదు లక్ష్యమని" తెలియజేస్తూ, తప్పటడుగులు సరిదిద్ది, తమ తపోమయమయిన జీవితాలనే ఆదర్శంగా చూపి, దీపస్తంభంగా నిలిచి దివ్యత్వంవైపు అడుగులు వేయించారని అవగతమౌతుంది. సృష్టి, స్థితి, లయలను శాసించగలుగుతున్నా, భగవంతునితో సదా సంపర్కంలో ఉన్నా, ఆ అనంత ప్రకృతిలో సదామమేకమై ఉన్నా, ఉండగలుగుతున్నా కేవలం భగవంతుడు తమకు అప్పజెప్పిన ప్రతీ పైసాకు(జీవికి) లెక్క చెప్పడం కోసం తమ జీవితాలను త్యాగం చేసి, అనురాగంతో అందరిలోనూ భగవంతుని స్పృహను కలిగించి, తమ లీలా వినోదాలతో ఆ స్ఫురణను సదా నిలిపి, చివరికంటా గమ్యం చేరుస్తున్న గురుచంద్రులకు ఎన్ని విధాల నమస్సులు తెలియజేసుకున్నా అది తక్కువే.

"హరి, హరి అంటూ హరినే అయ్యాను" అంటూ శ్రీసాయిబాబా వాచా చెప్పడమే కాదు, ప్రాణుల పుట్టుక(సృష్టి), అసాధ్యమనుకునే విషయాల సుసాధ్యం(స్థితి), ప్రాణుల మరణం(లయ) ఇలా ప్రతీ అంశమూ వారి సంకల్పం ప్రకారం జరిగినట్లు మనకు స్పష్టమౌతుంది. గురు పరంపర అలానే కొనసాగుతోంది ఈనాటికీ పావనగంగలా. పరమాచార్య స్వామివారి జీవితం, శ్రీబాబూజీ జీవితం తులనాత్మకంగా, సమగ్రంగా పరిశీలిస్తే దైవం మనిషిగా తరతరాలను తరింపజేయడానికి అవతరిస్తున్నట్లు భక్తుల అనుభవాల ద్వారా కళ్ళకు కట్టినట్లు కనబడుతుంది ఈనాటికీ. శుకమహర్షి చెప్పినట్లు ఆ భక్తుల(మహాత్ముల) సన్నిధిని అరనిమిషం అనుభూతి చెందినా ఆద్యంతాలు లేని సద్గురు దివ్యచరణాలను చేరినట్లే. ఆ అనుభూతి కొరకే మన ప్రతీ అడుగును సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. **ఆ అనుభూతిని పొందేందుకు మహాత్ముల చరిత్రలు దోహదమవ్వాలి. ఆ చరిత్రల అధ్యయనం మన గురువుకు అనన్య శరణాగతి పొందేందుకు సోపానమవ్వాలి. పూర్వ జన్మల గురించి తెలియక, మరుజన్మల గురించి ఊహించలేక సాగే ఈ పయనంలో ఒక్కసారే పుట్టి ఒక్కసారి మరణించే ఈ ఒక్కసారి ఒక్క క్షణాన్ని కూడా అసంగతమైన అంశాలతో దుర్వినియోగం చేసుకోవడం సమంజసమా? ఆలోచిద్దాం...** ఆలస్యం లేకుండా కంచి కథలోనికి ప్రయాణం చేద్దాం.

1963వ సం॥ జూన్ మాసంలో మధుర మీనాక్షి అమ్మవారి కుంభాభిషేకం జరుపుటకు స్వామివారు నిర్ణయం చేశారు. సుమారు 50 లక్షల రూపాయల ఖర్చుతో ఆలయం మొత్తం నూతన రూపుదాల్చడానికి అహర్నిశలు శ్రమించారు ఎందరో భక్తులు, కార్మికులు. శ్రీపి.టి. రాజన్‌గారి నేతృత్వంలో సర్వాంగ సుందరంగా రూపుదాల్చింది ఆలయ ప్రాంగణం. పరమాచార్యస్వామివారు మధురై ఆగమనానికి ముందే తిరువిడైమరుదూర్‌లోని మధ్యార్జునానికి వేంచేశారు. ఆంధ్ర రాష్ట్రంలోని శ్రీశైలము, తమిళనాడులోని అంబసముద్రములోనూ కొలువైన రెండు ఈశ్వర శక్తిక్షేత్రాల మధ్యన అర్జునవృక్షము చెంతన ఉన్నందున ఈ క్షేత్రాన్ని మధ్యార్జునమని పిలుస్తారు. ఈ క్షేత్రమున మరో విశేషమేమంటే ఆదిశంకరులు ఈశ్వర సన్నిధానమున “ఏది సత్యం?” అని ప్రశ్నించిన వేళ ఒక చేయి పైకి వచ్చి “సత్యమద్వైతం” అని సమాధానమిచ్చినట్లు శంకరవిజయంలోనూ, గురువంశ మహాకావ్యములోను ప్రస్తావించబడింది. ఇందుకు ప్రతీకగా స్వామివారు మధ్యార్జునంలోని కంచి మఠ ప్రాంగణంలో లింగ ప్రతిష్ఠతోపాటు మందిర విమానంపై ఒక చేయి చూపినట్లుండే ప్రతీకను చేయించారు. **సద్గురు పథంలో నడవడం ఎంత ముఖ్యమో రాబోయే తరాలకు ఆ మార్గం యొక్క విశిష్ఠతను మరింత చేరువ చేయడం కూడా అంతే ముఖ్యం. అప్పుడేకదా అన్వేషణ బాటగా మారేది. సద్గురువే బాసటని తెలిసేది.**



మధురై నగరమంతా స్వామివారి రాకతో పండుగ వాతావరణం సంతరించుకుంది. తల్లి మీనాక్షి కుంభాభిషేకానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఎంతో అరుదుగా జరిగే ఈ విశేష కార్యక్రమానికి సుమారు మూడు లక్షలమంది భక్తజనులు మధురై చేరారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులతో కిటకిటలాడింది మధురై నగరం. ముప్పయి వేలమంది భక్తులకు మందిరంపైన, లోపల, ఆరుబయట కూర్చునే అవకాశం లభించింది. ఎంతో మంది మందిరం చుట్టూ ఉన్న భవంతుల పైకెక్కి ఈ పవిత్ర కార్యాన్ని దర్శించారు. రెండు ముఖ్య బంగారు గోపురాలకు మరియు పన్నెండు చిన్న గోపురాలపై ఉన్న 84 కలశాలకు కుంభాభిషేకం జరిగింది. కేరళ రాష్ట్ర గవర్నర్ వి.వి.గిరి, మద్రాసు గవర్నర్ బిష్ణురాయ్ ఇలా ఎందరో ప్రముఖులు, క్రైస్తవ, ముస్లిం మత పెద్దలు, అమెరికా సంయుక్త రాష్ట్రాల కాన్సులర్ జనరల్ మొదలగు వారికి ప్రత్యేక స్థలాలు కేటాయించబడ్డాయి. ప్రాతఃకాలములోనే కుంభాలకు వలసిన పూజాదికాలు జరిగాయి. ఖచ్చితంగా ఉదయం పదిగంటలకు కుంభాభిషేక ప్రారంభానికి గుర్తుగా అందరూ జాగరూకులై ఉండటానికి మొదటిసారి గాలిలోకి తుపాకీ పేల్చి



తెలియజేశారు పోలీసు అధికారి. ఐదు నిమిషాల తరవాత మరోసారి తుపాకీ శబ్దంతో అన్ని కలశాలపై ఒకేసారి కుంభాభిషేక పవిత్ర జలాలను కుమ్మరించారు అర్చకస్వాములు. అనంతరం ఆలయంలోని అన్ని దేవతా ప్రాంగణాలలోనూ దీపారాధన జరిగింది. జనులందరిపై అభిషేక జలాల తీర్థం చల్లడంతో పరవశించారు. ప్రభుత్వం అన్ని లక్షలమందికీ వలసిన రవాణా, వైద్య, ఆహార ఏర్పాట్లను చేసింది. రాత్రి పంచమూర్తుల నగరోత్సవంతో కుంభాభిషేకం విశేషంగా ముగిసింది.

1964వ సం॥లో ఇప్పుడు మనం దర్శించుకునే కంచి మఠ ప్రాంగణం పునరుద్ధరించబడింది. సురేశ్వరాచార్యుల అధిష్టానమును జాగ్రత్తగా కాపాడుకుంటూ ఆదిశంకరులతో కలిసి ఉన్న వారి శిష్యులను నేపథ్యంగా పదహారు స్తంభాలతో కూడిన గ్రానైట్ మందిరాన్ని తీర్చిదిద్దారు. ఈ మందిరాన మూడు వరుసల గోపురము, ఏడు కలశములతో ఆదిశంకరుల పాదుకలతో ప్రతిష్ఠితమైనది. ఈ మనోహర మందిరంలోనే నేటికీ జగద్గురువులచే జరిగే చంద్రమౌళీశ్వర సేవను మనం దర్శించుకోవచ్చు. ఇదే సంవత్సరంలో క్రైస్తవ మతపెద్ద పోప్ పౌలస్, వాటికన్ నగరం నుండి భారతదేశానికి విచ్చేశారు. ఈ రాకను నిరసిస్తూ హిందూ మహాసభ నల్లజెండాలతో ప్రదర్శన చేపట్టాలని నిర్ణయించింది. మహాస్వామివారు అలా చేయడం సరికాదని, ఇతర మతాలపట్ల, వారి పెద్దలపట్ల ద్వేషాన్ని చూపడం సరికాదని, సోదర భావంతో మెలగాలని పత్రికా ప్రకటన జారీ చేశారు. కంచిలోని మసీదును తరలించాలన్న అంతేవాసుల నిర్ణయాన్ని కూడా ఇలానే ఒక్క మాటతో "మసీదు కూడా మందిరమే కదా!" అని తెలియజెప్పి పరమత సహనాన్ని తాము ఆచరించి, భక్తజనులచే ఆచరింప చేశారు స్వామి. కంచి మఠ ప్రాంగణాన్ని, స్వామివారి బృందావనాన్ని దర్శించుకునే భక్తజనులు నేటికీ ప్రక్కనే ఉండే మసీదును కూడా గమనించవచ్చు.

1964వ సం॥ రామేశ్వరం తుఫానుకు 1800 మంది బలవ్వడం, ఎన్నో కుటుంబాలు నిరాశ్రయులవ్వడం స్వామివారిని కలచివేసింది. స్వామివారి మాటతో సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. బియ్యం, పప్పు, ఉప్పులతో, ఆహారపు సంచులతో ఎంతో వ్యయప్రయాసలకోర్చి కొందరు భక్తులు రామేశ్వరం చేరి ఎందరినో ఆదుకున్నారు. "మానవత్వాన్ని మించింది కాదు జ్ఞానం" అన్న మా గురుదేవుల వాక్కులు ఎంత సత్యమో, వారు మాకు చూపించిన మార్గమేమిటో అర్థమౌతోంది.



భద్రాచలంలో సీతారాముల వారి ఆలయాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం రావడం, అందులో కొన్ని అంశాలలో ముఖ్యంగా మూలమందిర నిర్మాణాన్ని మరల చేయాలా? వద్దా? అన్న అంశంలో ఏకాభిప్రాయం రాకపోవడంతో అప్పటి ముఖ్యమంత్రి సూచన మేరకు ఒక అధికారిక బృందం స్వామివారిని కలిసి వారి అభిప్రాయాన్ని అభ్యర్థించారు. స్వామివారు మూలమందిర నిర్మాణాన్ని చేపట్టమని చెప్పడమేకాక గర్భాలయ కొలతల గురించి వచ్చిన సందేహాలను తీరుస్తూ చక్కటి దారి చూపారు.

1965వ సం॥ ఏప్రిల్ నెలలో అప్పటి అమెరికా కాన్సులర్ జనరల్ ఫ్రాంక్లిన్ స్వామివారి చెన్నై విడిదిలో దర్శించుకున్నారు. మద్రాసు సంస్కృత కళాశాల ప్రాంగణంలో ఆకాశమే కప్పుగా ఒక చెక్కపీటపై స్వామివారు –ఎదురుగా ఒక పట్టాపై ఆ ఉన్నతాధికారి, ఇలా ఆ గోష్ఠి హృద్యంగా సాగింది. "పూజ్య స్వామివారి ఆయురారోగ్యాలకై నేను సదా భగవంతుడిని ప్రార్థిస్తానన్న" వారి మాటలకు వేల సంవత్సరాల ఆధ్యాత్మిక వైభవాన్ని వారు గౌరవిస్తున్నారని స్వామివారు సమాధానం చెప్పారు. స్వామివారి పాదయాత్రను గురించి వాకబు చేసిన క్రమంలో పాదచారిగా ఉండటం వారి ఆరోగ్యాన్ని కాపాడుతోందని, పుష్టిగా ఉంచుతోందని చెప్పారు స్వామి. స్వామివారి యాత్రలో తాను భాగమవ్వాలని అభిలషిస్తున్నాని తెలియ చేశారు ఫ్రాంక్లిన్. తమ యాత్ర ప్రారంభమైనప్పుడు తెలియ చేస్తానన్నారు స్వామి. తమిళంలో స్వామివారు సంభాషించడం, ఆ అధికారి ఆంగ్లంలో, మధ్యన అనువాదకునిగా శ్రీరామకృష్ణఅయ్యర్. ఇలా సాగిన ఆ సంభాషణలో స్వామివారు వసంత నవరాత్రుల ప్రాధాన్యత, కృష్ణుని అవతారం, అందులో వైజ్ఞానిక రహస్యం ఇలా ఎన్నో విషయాలను సంభాషించడం జరిగింది. ఫ్రాంక్లిన్ ఆనందానికి అవధులు లేవు. ఈసారి చెన్నై విడిదిలో ఐ.ఐ.టి మద్రాసులో ఈశ్వర ఆలయ ప్రతిష్ఠ క్రమంలో స్వామివారు ఆ విజ్ఞాన సంస్థను తమ పవిత్ర పదస్పర్శతో పునీతం చేశారు. భారత్–పాకిస్థాన్ మధ్య మొదలైన యుద్ధంలో భారత విజయప్రాప్తి కొరకై మరియు శాంతి కొరకై స్వామివారు సూచించిన శ్లోకములతో పుస్తక ముద్రణ జరగడం మరియు వాటిని లక్షలాదిగా సైనికులకు, పౌరులకు పంచడం జరిగింది. ఆ సంవత్సరం వ్యాసపూజ ఎన్నూరుకు దగ్గర్లోని ఒక చిన్న గ్రామం కట్టుపల్లిలో జరిగింది. విద్యుత్ సరఫరా కూడా లేని ఆ ఊరు ఎందరో భక్తులను ఆ సంవత్సరం అక్కున చేర్చుకుంది. అటు మత కార్యక్రమములకు, ఇటు భక్త జనులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా చూసుకున్న శ్రీషణ్ముఖసుందరాన్ని స్వామివారు అనుగ్రహించి, ఆశీర్వదించారు.



నాటికాలంలో దాతృత్వం కూడా అలా ఎటువంటి ఆడంబరాలకు దూరంగా శోభించేది. ప్రతి మనిషి భగవంతుని స్మరణ చేస్తూ, దైవం వైపుగా అడుగులు వేస్తూ, స్వధర్మాన్ని పాటిస్తూ సత్ప్రవర్తనతో మెలగాలన్న ఒక్క ఆలోచన తప్ప నడయాడే దైవమైన స్వామికి మరో కోర్కె ఏముంది? భగవంతుడు అలా దిగి వస్తే భక్తుడూ అలానే నడిచొస్తాడు మనవంటి ఆశ్రితులకు దారి చూపడానికి. ఇంతకు మునుపు కామాక్షి ఆలయ పునరుద్ధరణ సమయంలో అలానే జరిగింది. చిలుం పట్టిన కలశాలను చూసి వాటికి బంగారు తాపడం చేయిద్దామన్న ఆలోచన స్వామి చేశారో లేదో ఓ వంక మఠ మేనేజరు కంగారు పడుతున్నాడు, ఎక్కడ స్వామివారి ఆదేశమౌతుందోనని. ఇంతలోనే ఆలయంలో ఉన్న ఒక పెద్దముత్తైదువ తోసుకుంటూ ముందుకు వచ్చి ఒక గాజుల జతను స్వామివారికి సమర్పించింది. అంతే కొన్ని నిమిషాలలోనే అక్కడ ఉన్న ఎందరో సువాసినుల సమర్పణతో కేవలం రెండు రోజులలో బంగారు తాపడంతో కలశాలు రూపుదిద్దుకున్నాయి. **స్వామి మాటలే సర్వస్వమనుకున్న జాతి ఆనాటిది. సంపదయే సమస్తమని తలచి తరతరాలకు పోగేసుకున్నా తీరని కాంక్ష ఈనాటిది. ప్రతినిత్యం అస్థిరంగా సాగుతున్న జీవితాలను దర్శిస్తూనే ఉన్నా ఇంకా ఏదో తపన. అందుకే మా గురుదేవులన్నారు "పుట్టుకకే పురుడు పోస్తూ... నీ ఉనికినే మరచానయ" అని.**

ఒక మహాత్ముడిని, ఒక భాగవతుని, ఒక భక్తుడిని స్మరించుకోవడమంటే భగవంతుని చరణాలతో సదా సంస్పర్శలో నిలవడమే. **శ్రీరామకృష్ణులు అంటారు "దైవకృప అనే గాలి నిత్యం ప్రసరిస్తూనే ఉంటుంది. మన మనస్సనే పడవ ఆ మార్గంలో పయనించని కారణంగా, మనం తెరచాపను ఎత్తని కారణంగా ఆ కృపను పొందలేక పోతున్నాము"** అని. మన మనస్సనే పడవ సద్గురుచంద్రుని సన్నిధానం వైపుగా సాగాలంటే, ఆ అనుగ్రహ వాయువు దిశగా మనం తెరచాపను ఎత్తి పయనించాలి. అందుకు దోహదపడేవి మహాత్ముల చరిత్రలు. ఆందునా వారిని ఆశ్రయించి తరించిన భక్తజనుల ఆచరణ, మొక్కవోని విశ్వాసంతో ఆ అడుగుల వెంట సాగే మన పయనం. కేవలం ఇవి మాత్రమే మనలను మన సద్గురు సన్నిధానాన్ని చేర్చగలవు. గమ్యంలోనూ తానే ఉన్నా ఈ ప్రయాణం మాత్రం ఎన్నటికీ మధురమే. జీవిత పడవ ప్రయాణాన్ని ఆనందయానంగా మార్చుకోవాలంటే మన సరంగు గురువేనన్న ఎరుకలో నిలవాలి. వారి ముందు మోకరిల్లాలి. ఆ చరణాలకు శరణుపొందాలి. సర్వులకూ ఇదే దారి – తప్పక తెలుస్తుంది గురువే హరి... శుభం భవతు...సద్గురు చరణామృత ప్రాప్తిరస్తు...

– ***గురుకృప***



**గురుబంధువు :** గురువుగారూ! మేము ఎక్కువగా దర్శించే క్షేత్రం శిరిడీ. శిరిడీలో ఎలా ఉండాలి? ఏం చేసుకోవాలి? అందరూ... శిరిడీలో మాయ అనేది ఉంటుంది, అది మిమ్మల్ని మోసం చేస్తుంది. దాన్ని గుర్తుపెట్టుకొని వర్క్ చేసుకోవాలి అని అంటారు. అసలు నిజంగా మాయ అనేది ఉందా?

**గురువుగారు :** మాయను గుర్తుపెట్టుకోవడం కంటే బాబాను గుర్తుపెట్టుకోండి. సరేనా? మీ ఆలోచనలు, మీ మాటలు, మీ పనులు ఈ మూడింటినీ ఒకటి చేసుకునే ప్రయత్నం మీద లగ్నం చేయండి. మీరేమిటి అనే దాని పట్ల మీరు స్పష్టత తెచ్చుకోండి. అప్పుడు మీకు ఆ స్థాయిలో అయినా ఆత్మసాక్షాత్కారమవుతుంది. (గురువుగారు నవ్వుతూ...) ఆ అంతరం లేకుండా పోయినప్పుడు మనం ఎదగగలం.

మీరు నన్ను ఎలా చూస్తున్నారు అనేది ముఖ్యం కానీ నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నాననేది కాదు. నిజానికి నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నాననేది కూడా ముఖ్యమైనదే, కానీ మీరు దానిని అర్థం చేసుకోలేరు.

**– శ్రీసాయినాథుని శరత్ బాబూజీ**

# సాయిప్రేమ తలపు..
# శరశ్చంద్రుని మేలుకొలుపు..

"మా సంప్రదాయమే వేరన్న" స్పష్టమైన సాయిమాట,
మూఢవిశ్వాసముల కలుపు చేరేను ప్రేమపూదోట,
కాలంచెల్లిన ఛాందసములు కలిసెను సాయిబాట..
కులమతముల కల్మషపు పీడ పెరిగెను ప్రతీచోట..

స్వచ్ఛమైన సాయితత్వమే శరశ్చంద్రుడై ప్రభవించే
భక్తజన మనముల సముద్ధరణకై..
ఆచారముల ఆంతర్యమును, ఛాందసముల అసలు రంగును
తెలియచెప్పే ప్రగతి బాటకై..
కులమతముల తలపు సర్వజీవ సాయికే అవమానమని
మందలించే జగతి హితముకై..

**సాయిభక్తి ఉద్యమకారుడై.. ఆనందజీవన ఆచార్యుడై..**
**అవనికి వచ్చే మమ్ము దీవించుటకై..**